J/NELLORE/003/24-26 R.N.I.No.25359/74 పేజీలు : 12




THE BEST TELUGU WEEKLY OF NELLOREANS

# లాయర్

సంపుటి : 46 సంచిక : 12 21.8.2026, శుక్రవారం వెల : రూ. 10/- వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంపాదకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి

## విలువలకు రామ్.. రామ్..

# సభకు రాం.. రాం..



### తెలుగు రాష్ట్రాల నాయకుల్లో కొత్త పోకడ

### పేరుకే ప్రతిపక్షం.. సభకు వెళ్లరు - నిలదీయరు

### విమర్శించే స్థానంలో ఉంటూ.. విమర్శలకి భయపడుతున్న వైనం

### ఒకేతీరులో ఇటు జగన్, అటు కేసీఆర్

నిగ్గదీసి అడిగే స్థానంలో ఉంటూ నీళ్లు నములుతున్నారు. ప్రభుత్వాన్ని కడిగేసే అవకాశం ఉన్నా కూర్చున్న చోటు నుంచి కదలరు. ముఖ్యమంత్రిని, మంత్రులను సమస్యలపై ఎదురెదురుగా నిలబడి నిలదీసే అవకాశం ఉన్నా సభకే రారు, పాలకుల నుంచి సమాధానాలు రాబట్టరు.

ఇదీ.. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని ప్రతిపక్ష పార్టీ అధినేతల తీరు. ఒకప్పుడు క్షేత్రస్థాయిలో ప్రభుత్వాలపై పోరాటాలు చేస్తూనే అసెంబ్లీలో ప్రభుత్వాధినేతలను చెడుగుడు ఆడేసే దిగ్గజాలను చూసిన తెలుగు రాజకీయం నేడు అసెంబ్లీకి వెళ్తే ఏమౌతుందో అని జంకుతున్న నాయకులకు కేరాఫ్‌గా మారిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

మరి నిజంగానే నేటి ప్రతిపక్ష నాయకుల్లో పోరాడే గుణం, పోటీతత్వం సన్నగిల్లిందా..? లేక ప్రభుత్వంలో ఉన్నప్పుడు వెలగబెట్టిన ఘనకార్యాలను గుర్తుతెచ్చుకుని ముఖం చాటేస్తున్నారా..? అన్న ప్రశ్నలు జోరందుకుంటున్నాయి. తాజాగా ఏపీ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల వేళ మరోసారి ప్రతిపక్ష నేత జగన్ సభకు వెళ్ళని వైనం రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.

సమస్య తీవ్రమైనప్పుడే సమాధానం జాడ కనిపిస్తుంది. తట్టుకోలేనంత ఒత్తిడి ఎదుర్కొన్నప్పుడే కొత్త శక్తితో మనిషి రాటుదేలుతాడు. చిమ్మచీకటి ఎదురైనప్పుడే వెలుగు రేఖకు విలువుంటుంది. రాజకీయాల్లో సైతం ఇదే సూత్రం వర్తిస్తుంది. నాయకుడు పెను సమస్యలకు ఎదురు నిలబడి మొక్కవోని ధైర్యంతో ముందుకు సాగితేనే భవిష్యత్ ఉంటుంది. విమర్శలు, అవమానాలు ఎదుర్కొన్నప్పుడే ప్రజల సానుభూతి, అభిమానం దక్కుతుంది. అయితే, వీటన్నింటినీ గ్రహించే నేర్పు, ఒత్తిడిని తట్టుకునే స్థితప్రజ్ఞత నేటి కాలంలో రాజకీయ నాయకులకు కనిపించడం లేదంటే అతిశయోక్తి కాదేమో. ప్రస్తుతం తెలుగురాష్ట్రాల్లో కనిపిస్తున్న కొత్త రాజకీయ సంస్కృతి ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తోంది. ప్రధాన నాయకుల్లోని బేలతనాన్ని ఎత్తిచూపుతోంది.

### నింగికెగసి... పాతాళానికి పడిపోయి!

"వైఎస్ జగన్" ఈ పేరే ధీరత్వానికే ఓ బ్రాండ్ అని, అది గన్ కంటే పవర్‌ఫుల్ అని ఆ పార్టీ నాయకులు చెప్తుంటారు. మా నాయకుడికి తిరుగులేదని జబ్బలు చరుస్తుంటారు. నిజానికి జగన్ రాజకీయ పోరాటం అసాధారణమైనదిగానే చెప్పాల్సి

2లో



# సభకు రాం.. రాం..

(మొదటిపేజీ తరువాయి)

ఉంటుంది. ఆయన తండ్రి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అకాల మరణంతో అనూహ్యంగా, అనివార్యంగా రాజకీయాల్లోకి వైఎస్. జగన్ కాలు మోపారు. తొలుత ఓదార్పుయాత్రతో ప్రారంభించి ఆ పేరుతో ఏళ్ల తరబడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలను చుట్టేశారు. ఈక్రమంలో కాంగ్రెస్‌పార్టీకి దూరమై వైఎస్సార్ కాంగ్రెస్ పేరుతో వేరు కుంపటి పెట్టుకున్నారు. ఆ సమయంలో ఢిల్లీ నుంచి గల్లీదాక సోనియాగాంధీ పేరంటేనే నాయకులు హడలిపోయేవారు. ఆమె చెప్పిందే వేదం ఆమె చెప్పిందే శాసనం అనేలా పరిస్థితులు ఉండేవి. అయితే, అలాంటి సమయంలోనూ సోనియాగాంధీని ఎదిరించి, కాంగ్రెస్‌ను కాదని ఆయన కొత్తరాజకీయ పార్టీని ప్రారంభించారు. ఒకసారి ఓటమి ఎదురైనా వెనక్కితగ్గకుండా సుదీర్ఘ పాదయాత్ర చేసి మరీ 151 సీట్ల తిరుగులేని మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే, ఐదేళ్ల ఇష్టారాజ్యంగా పాలించి విమర్శలపాలయ్యారు. దౌర్జన్యాలు, దాడులు, దోపిడీలు, కబ్జాలతో విమర్శలు మూటకట్టుకున్నారు. తన ఐదేళ్ల పాలనా కాలంలో ఒక్కసారి కూడా మీడియా ముందుకు రావడంగానీ, ప్రతిపక్షాల ఆరోపణలు, ప్రజల డిమాండ్‌కు సమాధానం చెప్పడం కానీ చేయలేదు. పైగా ప్రచార సభల్లోనూ, ప్రభుత్వ కార్యక్రమాల్లోనూ పరదాల చాటున పర్యటనలు చేసి ప్రజల్లో విశ్వాసం కోల్పోయారు. ముఖ్యంగా చంద్రబాబును సరైన ఆధారాలు లేకుండా కక్షసాధింపు ధోరణితో అరెస్టుచేసి మూల్యం చెల్లించుకున్నారు. ఫలితంగా 151 నుంచి 11 సీట్లకు పడిపోయి కనీసం ప్రధాన ప్రతిపక్ష నాయకుడి హోదాను సైతం కోల్పోయారు.

### దెబ్బతిన్నా వాస్తవాన్ని గ్రహించలేక..!

కర్ణుడి చావుకు సవాలక్ష కారణాలన్నట్లుగా గత ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ ఓటమికి లెక్కలేనన్ని కారణాలున్నాయి. "చంద్రబాబు గెలవలేదు – జగన్ ఓడిపోయాడు" అని రాజకీయ విశ్లేషకులు కామెంట్ చేసే స్థాయిలో వైసీపీ ఓటమిపాలయ్యింది. అయితే వాటిని గుర్తించకుండా మొండిగా తాననుకున్నదే ప్రజలూ అనుకుంటారన్న భ్రమతో వైఎస్ జగన్ ముందుకెళ్తున్నట్లు కనిపిస్తోంది. జనం ఆకాంక్షలేవి..? నాయకుడు వారికి ఎలా అండగా నిలబడాలి..? ఏఏ విషయాలు ప్రజలతో కలిసిపోరాడాలి..? అసెంబ్లీలో ప్రభుత్వాన్ని ఎలా ఇరకాటానపెట్టాలి..? ప్రజల ముందు అధికారపార్టీని దోషిగా ఎలా నిలబెట్టాలి వంటి విషయాలపై వ్యూహాలు రచించకుండా నిర్లిప్తంగా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ క్రమంలో ఆయన అసలు శాసనసభకే రాకుండా పూర్తిగా దూరమయ్యారు. పైగా తన పార్టీ తరపున గెలిచిన మిగిలిన 10 మందిని కూడా సభకు వెళ్లనివ్వకుండా తీవ్ర విమర్శలను మూటకట్టుకుంటున్నారు. ఇక తెలంగాణ విషయానికొస్తే సుదీర్ఘ తెలంగాణా ఉద్యమం తర్వాత.. అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు గెలుపొంది, అక్కడ పదేళ్లపాటు ముఖ్యమంత్రిగా చక్రం తిప్పిన కేసీఆర్. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత ఫాంహౌస్‌కే పరిమితమయ్యారు. ఒకటి రెండు సార్లు బహిరంగ సభల ద్వారా ప్రజల్లోకి వచ్చినా ఆ తర్వాత పూర్తిగా సైలెంట్ అయిపోయారు. అసెంబ్లీ సమావేశాలకి తానూ ముఖం చాటేసినా తమ పార్టీ ఎమ్మెల్యేలను మాత్రం అసెంబ్లీకి పంపిస్తూ ప్రభుత్వాన్ని ఎప్పుడుకప్పుడు ప్రశ్నిస్తూ తమ పార్టీ ఉనికి చాటుకుంటున్నారు.

### ప్రజల డబ్బు.. పప్పుబెల్లాల్లా...!

ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ నిర్వహణకు సంబంధించి నిమిషానికి రూ.8,500 ఖర్చవుతోంది. అంటే గంటకు రూ. 5.10 లక్షలు వెచ్చిస్తున్నారు. ఇక ఎమ్మెల్యేలకు నెలకి 1.25లక్షలు ప్రభుత్వం అందజేస్తోంది. ఇక హెచ్ఆర్‌ఏ కింద రూ.50వేలు, డైలీ అలవెన్స్ కింద రోజుకు రూ.1000 నుంచి రూ. 2000 అందజేస్తున్నారు. ఇంత పెద్దమొత్తంలో ప్రజల ధనాన్ని ప్రజాప్రతినిధుల పేరుతో దండుకుంటున్న నేతలు శాసనసభకు హాజరై ప్రజా సమస్యలను మాత్రం చర్చించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే క్రమంలో నెలకొకసారి తమకు నచ్చిన మీడియా ప్రతినిధులను పిలిచి ఇష్టారాజ్యంగా గంటల తరబడి తమకు తోచిన అంశాలను పిచ్చాపాటీ మాట్లాడి, వెంటనే బెంగళూరు బాటపట్టడం కూడా జగన్‌మోహన్‌రెడ్డికి పెద్ద మైనస్‌గా మారిందనే మాట వినబడుతోంది. అయినా జగన్ తన తీరు మార్చుకోకుండా తాజాగా వర్షాకాల సమావేశాలకు కూడా అసెంబ్లీకి రాకుండా దుమ్మాకొట్టడం ఆయన స్వయంకృతాపరాధమే అనే వాదనలు వినిపిస్తున్నాయి. అది చివరికి త్వరలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక రాజకీయాల్లో నిర్లిప్తత, నిర్లక్ష్యం, ఏమరపాటు ఏమాత్రం తగదని, ప్రత్యర్థి ఒక ఎత్తు వేసేలోపే మనం పది ఎత్తులకు సంసిద్ధమై ఉండాలంటారు రాజకీయ పండితులు. అలాంటిది వచ్చిన అవకాశాలను కూడా సద్వినియోగం చేసుకోకుంటే అసలుకే మోసం వచ్చే ప్రమాదం ఉంది.

ఈ విషయాలను ఇప్పటికైనా జగన్, కేసీఆర్ గ్రహిస్తే వారికి, వారి పార్టీకి, వారిని నమ్ముకున్న కార్యకర్తలకూ మంచిది. లేకుంటే వారి పార్టీలు జనబాహుళ్యంలో మరింత పలుచన కాక తప్పని పరిస్థితి రావొచ్చు కూడా. మరి రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉండి, ముఖ్యమంత్రులుగా పనిచేసిన జగన్, కేసీఆర్ ప్రజల మనస్సు, ప్రజల కోరికలను గ్రహించి పార్టీ శ్రేణులను ముందుండి నడిపిస్తారో..? లేక ఎప్పటిలా వచ్చే ఎన్నికల నాటికి చూసుకుందాం అని కేసీఆర్, పాదయాత్ర సమయానికి అప్రమత్తం అవుదాం అని జగన్ మిన్నకుంటారో కాలమే నిర్ణయించనుంది.

ఏదేమైనా ఒక్కటి మాత్రం నిజం.. ప్రజాప్రతినిధులు ప్రజాస్వామ్యంలో దేవాలయాలుగా భావించే చట్టసభలకు వెళ్లకుండా జీతాలు పొందడం, హోదా అనుభవించడం, రాచమర్యాదలు అందుకోవడం ఏమాత్రం సహేతుకం కాదు. పైగా అది ప్రజలకు చేసే ద్రోహం కూడా. మరి మన నాయకులు ఈ విషయాన్ని ఇప్పటికైనా గుర్తిస్తారో..? మా మంకు పట్టు మాదే అన్నట్లుగా ముందుకెళ్తారో వేచి చూడాలి...!

## డీఎస్సీపై.. అబద్ధపు ఆరోపణలు



'ఆత్మగౌరవ ప్రదర్శన'లో ఉపాధ్యాయులు

కేవలం రాజకీయ లబ్ధికోసమే కొందరు డీఎస్సీపై అబద్ధపు ఆరోపణలు చేస్తున్నారని, ఎంతో కష్టపడి చదువుకుని ఉద్యోగాలు సాధిస్తే దానిపై లేనిపోని రాద్ధాంతాలు చేస్తే సహించేది లేదని ఉపాధ్యాయులు మండిపడ్డారు. నెల్లూరులో ఈనెల 16న వందలాది మంది ఉపాధ్యాయులు రోడ్డెక్కి 'ఆత్మగౌరవ ప్రదర్శన' చేపట్టారు. ఎన్నో సంవత్సరాలు నిరీక్షించి డీఎస్సీ రాసి ఉద్యోగాలు తెచ్చుకున్నామని, ఎక్కడా అభ్యర్థుల నుంచి ఎలాంటి అభ్యంతరాలు కూడా రాలేదని, అయితే కొందరు డీఎస్సీ పట్ల, ఉపాధ్యాయులను కించపరుస్తూ మాట్లాడుతుండడం ఏమిటని వారు ధ్వజమెత్తారు. ఉపాధ్యాయ సంఘం జిల్లా కన్వీనర్ బషీర్ అహ్మద్, తెలుగునాడు ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌శెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా కోఆర్డినేటర్ సుజన, జిల్లా టీఎన్‌యుఎస్ అధ్యక్షుడు రామచంద్రయాదవ్, చల్లా వెంకటేశ్వరులు, అన్నం వెంకటేశ్వర్లు, కర్నాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఈత పోటీల్లో.. కోర్టు ఉద్యోగి ప్రతిభ



కాంస్య పతకం అందుకుంటున్న శ్రీనివాసులు

నెల్లూరుజిల్లా కోర్టులో సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న నెల్లిపూడి శ్రీనివాసులు స్విమ్మింగ్ పోటీల్లో ప్రతిభ చూపుతున్నారు. ఇటీవల నరసరావుపేటలో జరిగిన అంతర్‌జిల్లాల రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొని మూడవ స్థానం సాధించి, కాంస్య పతకం అందుకోవడం విశేషం.

## బీసీలకు.. న్యాయం చేయండి

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం కాకుండా 43 శాతం రిజర్వేషన్లు కల్పించేలా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కృషి చేయాలని బీసీ సంఘాల రాష్ట్ర జేఏసీ కార్యదర్శి ఒట్టూరు సంపత్ రాజు ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బీసీలకు 43 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే రాష్ట్రంలోని లక్షలాది మంది బీసీలు ముఖ్యమంత్రి చంద్రబాబుకు జీవితాంతం రుణపడి ఉంటారని పేర్కొన్నారు. నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించినప్పటి నుంచి బీసీలు టీడీపీ వెంటే నడుస్తూ తమవంతు సహాయ సహకారాలు అందిస్తున్నారని గుర్తుచేశారు. రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు పెంచి న్యాయం చేయాలని కోరారు.

## రాష్ట్రస్థాయి ఆర్చరీ పోటీలకు.. 'డా.కిషోర్స్ రత్నం' విద్యార్థులు




విద్యార్థులను అభినందిస్తున్న రామ్మూర్తినాయుడు

క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ వారు ఇటీవల జిల్లాస్థాయి ఆర్చరీ పోటీలను నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో స్థానిక డా.కిషోర్స్ రోషిణి రత్నం హైస్కూల్ విద్యార్థిని కె.జనని (10వ తరగతి) కాంపౌండ్ విభాగంలో, కె.మోక్ష(9వ తరగతి) ఇండియన్ బో విభాగంలో, పి.భావజ్ఞ హంసిని (8వ తరగతి) రికర్వ్‌బో విభాగంలోనూ వ్యక్తిత్వ శ్రేణిలో ప్రథమ స్థానం సాధించినట్లు స్కూల్ నిర్వాహకులు తెలిపారు. ఆ విద్యార్థులు ఈనెల 24 నుంచి 27వ తేదీ వరకు తిరుపతిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొననున్నారని వివరించారు. రాష్ట్రస్థాయి పోటీలకి ఎంపికైన ఆ విద్యార్థులను డా.కిషోర్స్ రత్నం విద్యాసంస్థల డైరెక్టర్లు డా.కృష్ణకిషోర్, వాసంతి అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల జనరల్ మేనేజర్ రామ్మూర్తినాయుడు, జూనియర్ మేనేజర్ అజయ్‌సింగ్, ప్రిన్సిపాల్ మణిమాల తదితరులు పాల్గొన్నారు.


## నాగబాబుకి పదవి.. జనసైనికుల హర్షం



కేక్ కట్ చేసి ఆనందాన్ని పంచుకుంటున్న జన సైనికులు

జనసేన పార్టీ పట్ల అంకితభావంతో పనిచేస్తున్న కొణిదెల నాగబాబుకి ప్రభుత్వం ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా కేబినెట్ హోదా కల్పించడాన్ని స్వాగతిస్తూ నెల్లూరులోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద నాయకులు, జనసైనికులు ఈనెల 19న సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మొక్కలు నాటి, కొన్ని మొక్కలను పంచిపెట్టారు కేక్ కట్ చేసి నాగబాబుకి శుభాకాంక్షలు తెలిపారు. జనసేన జిల్లా నాయకుడు కిషోర్ గునుకుల మాట్లాడుతూ, నాగబాబుకి లభించిన ఈ పదవి కేవలం ఒక అధికారికహోదా కాదని, ఆంధ్రప్రదేశ్‌ను హరిత రాష్ట్రంగా తీర్చిదిద్దే గొప్ప బాధ్యత అని అన్నారు. తమ పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ మొదటి నుంచీ పర్యావరణ పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. గతంలోనే నాగబాబు పలు ప్రాంతాలను దత్తత తీసుకుని వాటిని పచ్చదనంతో నింపేందుకు కృషిచేశారని గుర్తుచేశారు. ఇప్పుడు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్‌గా విస్తృతమైన బాధ్యతను చేపట్టడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా హరితాభివృద్ధికి కొత్త దిశానిర్దేశం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. మల్లికార్జునయాదవ్, నారాయణ, ప్రవీణ్‌రెడ్డి, సురేష్, సనత్‌కుమార్, ప్రశాంత్ గౌడ్, రిషి యాదవ్, హేమచంద్ర యాదవ్, నాగేంద్ర బాలు, హరి పాల్గొన్నారు.

## పురాణ పండితుడు..నేలనూతల కన్నుమూత!




ప్రముఖ పురాణ పండితుడు, నెల్లూరు మూలాపేట నివాసి నేలనూతల శ్రీనివాసమూర్తి ఇటీవల కన్నుమూశారు. 1934లో ఆయన జన్మించారు. 92 ఏళ్ల వయోవృద్ధులైన ఆయన వృద్ధాప్య కారణాలతో కాలధర్మం చెందారు. ఆయనకి భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. శ్రీనివాసమూర్తి ఉపాధ్యాయునిగా, పురాణ పండితునిగా అందరికీ సుపరిచితులే. ప్రముఖ సాహితీవేత్త స్వర్గీయ నేలనూతల శ్రీకృష్ణమూర్తికి ఈయన సోదరులు. ఆయన బాల్య విద్యాభ్యాసమంతా నెల్లూరులోనే జరిగింది. మూలాపేటలోని వేదసంస్కృత పాఠశాలలో చదువుకుని సంస్కృతాంధ్రభాషల్లో ప్రావీణ్యం సంపాదించారు. రాజమహేంద్రవరంలో భాషాప్రవీణ శిక్షణ పొంది, నెల్లూరులోని ఇవిఎస్ఆర్ఎం, ఆర్‌ఎస్ఆర్ఎం, బీవీఎస్ బాలికల పాఠశాలల్లో గ్రేడ్–1 తెలుగు పండితునిగా పనిచేసి, ఆర్ఎస్ఆర్ఎం స్కూల్‌లో ఉద్యోగ విరమణ పొందారు. ఉత్తమ ఉపాధ్యాయునిగా ఆయన ప్రభుత్వం నుంచి అవార్డును అందుకున్నారు. ఉద్యోగ విరమణానంతరం దాత స్వర్గీయ ఏనుగు పట్టాభిరామిరెడ్డి కోరిక మేరకు పోలీస్ బాలుర హాస్టల్‌లో వెనుకబడిన విద్యార్థులకు సాయంత్రం వేళ ఉచితంగా పాఠాలు చెప్పేవారు. ఉపాధ్యాయ వృత్తిలో ఉన్నప్పుడు ప్రతిరోజూ సాయంత్రం నెల్లూరులోని పలు దేవాలయాల్లో పురాణ ప్రవచనాలు చెప్పేవారు. సహృదయునిగా, ఆధ్యాత్మిక విశేషాలు తెలియజెప్పే పండితునిగా ఆయనకు మంచి పేరు. జ్యోతిష శాస్త్రంలోనూ ఎంతో అనుభవజ్ఞులు. భిక్షాటనా పూర్వక త్యాగరాజ ఉత్సవాల్లోనూ ఆయన పాల్గొనేవారు. సాహిత్యరంగంలోనూ ఎందరికో మార్గదర్శకులు కూడా. ఆయన మరణానికి సహచరులు, స్నేహితులు.. సాహిత్యాభిలాషులు చింతిస్తూ, ఆయన కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

## మేయర్, మునిసిపల్ ఛైర్మెన్‌లకి..

# ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు

### • అసెంబ్లీలో మంత్రి నారాయణ వెల్లడి



ఆంధ్రప్రదేశ్‌లో మేయర్, మునిసిపల్ ఛైర్మెన్‌ల ఎంపికకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు వీలు కల్పించే ఆంధ్ర ప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు రాష్ట్ర శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ ఇటీవల శాసనసభలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం మేయర్, మున్సిపల్ చైర్మన్‌లను పరోక్ష విధానంలో ఎన్నుకుంటున్న నేపథ్యంలో, ఎన్నికల విధానంలో మార్పు తీసుకువస్తూ ప్రభుత్వం ఈ చట్ట సవరణను ప్రతిపాదించడం విశేషం. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, 1986 వరకు మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపి కకు పరోక్ష ఎన్నికలు జరిగేవని తెలిపారు. అనంతరం 1986 నుంచి 2005వరకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయని, 2005 నుంచి ఇప్పటివరకు మళ్లీ పరోక్ష ఎన్నికల విధానం కొనసాగుతోందని వివరించారు. ప్రస్తుతం తీసుకొచ్చిన చట్ట సవరణతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు.

**రాజకీయ ప్రభావం తగ్గుతుంది :**

ప్రజలే నేరుగా మేయర్ లేదా మున్సిపల్ చైర్మన్‌ను ఎన్నుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని, ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజల నుంచి ఎన్నికైన మేయర్, చైర్మన్‌కు బలమైన ప్రజామోదం ఉంటుందని మంత్రి తెలిపారు. అలాగే కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ద్వారా కాకుండా ప్రజలే నేరుగా ఎన్నుకోవడం వల్ల మేయర్ లేదా చైర్మన్‌పై కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రభావం ఉండదని వివరించారు. మేయర్, చైర్మన్‌లు వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే అవ కాశం కూడా ఉంటుందని, నగరాలు, పట్టణాల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేసేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు. అదేవిధంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, ప్రజా రవాణా, వ్యర్థాల నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి అంశాల్లో సుదీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు చేసే వీలుంటుందని, ప్రత్యక్ష ఎన్నికల విధానం ద్వారా మేయర్ లేదా చైర్మన్‌పై రాజకీయ ప్రభావం తగ్గే అవకాశం ఉంటుందని నారాయణ చెప్పారు.

# హెల్మెట్ లేకుంటే.. నెల్లూరుకి 'నో ఎంట్రీ'

### • 'రోడ్డు భద్రతా కమిటీ సమావేశం'లో కలెక్టర్ హిమాన్షు శుక్ల



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజిత వేజెండ్ల, ఉప రవాణా కమిషనర్ చందర్

నెల్లూరు నగరంలోకి ప్రవేశించే మార్గాల్లో వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి చేయాలని, హెల్మెట్ ధరించని వాహనదారులను నగరంలోకి అనుమతించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ డాక్టర్ అజిత వేజండ్ల నిర్వహించారు. 'హెల్మెట్ లేకుండా నెల్లూరు నగరంలో ప్రవేశించడానికి కుదరదని జిల్లా కలెక్టర్ ఆదేశాలిచ్చారు.

తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతుండడం, అందులో ఎక్కువగా హెల్మెట్ లేకపోవడం వల్ల జరిగే ప్రమాదాలు.. మరణాలు కూడా సంభవిస్తుండడాన్ని ఉప రవాణా కమిషనర్ చందర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను అరికట్టడంతో పాటు ప్రజలకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని కమిటీలోని అధికారులకు సూచించారు. జిల్లాలో తరచూ ప్రమాదాలు జరిగే ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఎన్‌హెచ్ అధికారులు నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు రేడియం పెయింటింగ్ వేయాలని సూచించారు. హైవేలపై రాంగ్ రూట్‌లో వచ్చే వాహనాలను గుర్తించి చర్యలు చేపట్టేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ఆ వివరాలను పోలీసులకు అందించాలని అన్నారు.

**ప్రమాదానికి గురైన బాధితులను మానవత్వంతో ఆదుకోవాలి :**

రోడ్డు ప్రమాదానికి గురైన బాధితులను మానవతా దృక్పధంతో ఆదుకోవాలని కలెక్టర్ చెప్పారు. ప్రమాదాలు జరిగిన వెంటనే బాధితులను స్థానికంగా ఉన్న ఆసుపత్రుల్లో చేర్పించి, ఒక గంట గోల్డెన్ అవర్‌లో వైద్య చికిత్స అందించేందుకు సహాయం చేసిన వారికి గుడ్ సమారిటన్ ప్రోత్సాహకాన్ని రూ.5 వేల నుంచి రూ.25 వేలకు పెంచినట్లు కూడా కలెక్టర్ తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు గురై నిస్సహాయ స్థితిలో ఉన్న బాధితులకు తక్షణ సాయం అందించి వారి ప్రాణాలను కాపాడేందుకు ప్రజలను ప్రోత్సహించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ఆసుపత్రిలో చేరిన బాధితులను ఈడార్‌లో నమోదు చేసి, పోలీసుల సహకారంతో రూ.1.50లక్షల వరకు ప్రభుత్వం ఉచిత వైద్యం అందిస్తుందని తెలిపారు. ఈ విషయాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

**నగరంలోని ప్రధాన కూడళ్లలో ఆక్రమణలు తొలగించాలి :**

ఈ సందర్భంగా నగరంలో ట్రాఫిక్ సమస్యలను కూడా జిల్లా అధికారులు సమగ్రంగా చర్చించారు. సమస్యల నివారణకి తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. ముఖ్యంగా నెల్లూరు నగర పరిధిలోని మద్రాసు బస్టాండ్, ఆర్టీసీ, ఆత్మకూరు బస్టాండ్, స్టోన్‌హౌస్‌పేట ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డు మార్జిన్ ఆక్రమణలు లేకుండా ట్రాఫిక్ సమస్యల నివారణకు మున్సిపల్ కార్పొరేషన్, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా పరిశీలించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. అలాగే ప్రైవేటు ట్రావెల్ బస్సుల పార్కింగ్ కోసం సర్వోదయ కళాశాల గ్రౌండ్, కేవీఆర్ సమీపంలోని దేవాదాయ శాఖ ఖాళీస్థలాలను పరిశీలించి, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. టోల్‌గేట్ వద్ద టాయిలెట్లు ఉన్నట్లు తెలియజేసే బోర్డులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కావలి సమీపంలో ఉన్న ట్రక్ లేబై సమాచారాన్ని కూడా వాహనదారులకు తెలియజేసేలా సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.

ఈ సమావేశంలో డీటీసీ చందర్‌తో పాటు ఏఎస్పీలు దీక్ష, సౌజన్య, డీఆర్‌ఓ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నందన్, జిల్లాస్థాయి అధికారులు, ట్రాఫిక్, పోలీసుశాఖ అధికారులు, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# అనాథలపై తరగని 'వాత్సల్యం'

### 20 ఏళ్లలో విపిఆర్ కోటి విరాళం



'వాత్సల్య' కార్యదర్శి సాంబశివరావుకి చెక్కుని అందజేస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

అనాథలు, అభాగ్యుల సేవ పట్ల నెల్లూరు ఎంపీ వేమిరెడ్డికి ఎంత ఆదరమో తెలియజెప్పే ఘటన ఇది. తన దాతృత్వంలో ఆయన ఎంతోమంది దీనులకు బాసటగా నిలిచారు. ప్రత్యేకించి నెల్లూరు, కొండాయపాళెంరోడ్డులో ఉన్న నిరాధార బాలబాలికలు, వృద్ధుల సంరక్షణ కేంద్రం-జనహిత వాత్సల్య సంస్థకు ఆయన గత 20 సంవత్సరాలుగా అండగా నిలుస్తూ, బాలబాలికలు, వృద్ధుల సంరక్షణకు అవసరమైన ఖర్చుల నిమిత్తం ప్రతి సంవత్సరం ఆగస్టులో రూ.5 లక్షల చొప్పున విరాళంగా అందిస్తూ వస్తున్నారు. ఇందులో భాగంగా ఈనెల 19న ఈ ఏడాదికి సంబంధించి 5 లక్షల రూపాయల చెక్కును ఆయన జనహిత వాత్సల్య సంఘటన కార్యదర్శి జీవీ సాంబశివరావుకి అందజేశారు. గత రెండు దశాబ్దాలుగా ప్రతి సంవత్సరం రూ.5 లక్షల చొప్పున అందించిన విరాళాలతో ఇప్పటి వరకు మొత్తం రూ.1 కోటి ఆర్థిక సహాయాన్ని జనహిత వాత్సల్య సంస్థకు ఆయన అందించినట్లయింది. అదేవిధంగా, అమరావతి ఛాంపియన్‌షిప్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు జనహిత వాత్సల్యకు చెందిన భరత్, ధన్విత్ బాలుర జట్టులో, శీనమ్మ, హేమలత బాలికల జట్టులో నెల్లూరు జిల్లా హాకీ జట్టుకు ఎంపికైనట్లు సంఘటన కార్యదర్శి, ఎంపీ వేమిరెడ్డి దృష్టికి తీసుకురావడంతో, క్రీడల్లో ప్రతిభ కనబరిచి జిల్లా హాకీ జట్టుకు ఎంపికైన వాత్సల్య పిల్లలను ఆయన అభినందించారు. అనంతరం, జనహిత వాత్సల్య కార్యదర్శి జీవీ సాంబశివరావు మాట్లాడుతూ, నిరాధార బాలబాలికలు, వృద్ధుల సంరక్షణ కోసం గత 20 సంవత్సరాలుగా నిరంతరంగా ఆర్థిక సహాయం అందిస్తున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

# బాధ్యతలు చేపట్టిన..కొత్త జిల్లా జడ్జి

జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా ఏ.నరసింహమూర్తి ఈనెల 19న నెల్లూరులోని జిల్లా కోర్టులో బాధ్యతలు స్వీకరించారు. తిరుపతి జిల్లా ప్రత్యేక (ఎర్రచందనం) కోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న ఆయన, బదిలీపై నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్.అంకయ్య, బార్ అధ్యక్ష ఉపాధ్యక్షులు అయ్యపరెడ్డి, జల్లి పద్మాకర్, ప్రధాన కార్యదర్శి నాగరాజు, బార్ అసోసియేషన్ సభ్యులు, న్యాయవాదులు ఆయనను కలిసి స్వాగతించారు.

**రాజరాజేశ్వరమ్మవారి దేవాలయంలో...**



జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఏ.నరసింహమూర్తి దంపతులు ఈనెల 19న బుధవారం నెల్లూరు దర్గామిట్టలోని శ్రీ రాజ రాజేశ్వరమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకుని, ఆలయ అర్చకులు-వేదపండితుల ఆశీర్వచనాలు అందుకున్నారు. ఆలయ ఛైర్‌పర్సన్ ఏలూరు శిరీష, ధర్మకర్తలు, ఆలయ సహాయ కమిషనర్ కోవూరు జనార్ధన్‌రెడ్డి వారికి స్వాగతం పలికారు.

# డీసీసీబీలో ఉద్యోగోన్నతులు



నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ)లో ఉద్యోగులకు ఉద్యోగోన్నతులకు సంబంధించిన ఇంటర్వ్యూలు ఈనెల 19వ తేదీ బుధవారంతో ముగిశాయి. ఆమేరకు నెల్లూరులోని డీసీసీబీలో ఛైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి నియామకపత్రాలు అందజేశారు. డిప్యూటీ జనరల్‌మేనేజర్‌గా రమేష్‌బాబు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్‌లుగా శ్రీనివాసరావు, సాయి కేశవరామ్, చీఫ్ మేనేజర్లుగా నిరుపమాదేవి, నాగగాయత్రి, నాగరాజు, మేనేజర్లుగా సాయిలీల, దేవసేన, అసిస్టెంట్ మేనేజర్లుగా అంకమ్మ, యాస్మిన్, శశాంక్, రామ్‌చరణ్, సాయివందన ఉద్యోగోన్నతులు పొందారు.

లాయర్
ఆగస్టు 21, 2026

# కూరగాయలు కాదు.. 'క్రూర'గాయలు!

మనదేశంలో కల్తీలేనిదేమీ లేదు. అన్నీ కల్తీయే. సర్వం కల్తీమయమే. పీల్చే గాలి, తాగే నీరు, తినే తిండి, వాటిలో వాడే పదార్థాలు, వస్తువులు అన్నీ కల్తీయే. సమాజంలో స్వార్థం విపరీతంగా పెరిగిపోయింది. 'ఎవరేమైపోయినా.. వారి ఆరోగ్యం నాశనమై చచ్చిపోయినా మనకేం పర్వాలేదు.. సంపాదనే ధ్యేయం'.. అనే రీతిలో వ్యాపారులు, వ్యాపారాలు దిగజారిపోయిన పరమ దౌర్భాగ్య కాలమిది. దేశవ్యాప్తంగా ఇదే దుస్థితి. అందులో మన తెలుగు రాష్ట్రాల్లోవారు మరింత ఆశతో కల్తీలకి మరిగి విజృంభించేస్తున్నారు. కల్తీలకి కాదేదీ అనర్హం అన్నట్లుగా ప్రతి దాన్నీ కల్తీ చేసి, అక్రమంగా ధనార్జన చేసి తమ పొట్టలు నింపుకుంటున్నారు. పాలల్లో నీళ్లు కలిపి కల్తీ చేసే రోజులు ఎప్పుడో పోయాయి. పాలూ నీళ్ళు లేకుండానే రసాయనాలతో పాలు తయారుచేసి సీసాల్లో పోసి అమ్మేసు కుంటున్నారు. పాలల్లోనూ, పండ్లల్లోనూ కల్తీయే. పాలు-వెన్న లేకుండానే ప్రమాదకరమైన రసాయనాలతో నెయ్యిని తయారు చేసి, టన్నులకొద్దీ అమ్మేసుకుని సొమ్ము చేసుకుంటున్నారు. పండ్లకి కూడా రసాయనాల సూదులు గుచ్చి, మగ్గబెట్టి తాజా పండ్లు అన్నట్లుగా చూపించి జేబులు నింపుకుంటున్నారు. మాంసాహారం ఇష్టంగా తినేవారికి మస్కా కొట్టి, కోళ్ల వ్యర్థాలతో వేడివేడి బిర్యానీలు వండిపెట్టి జనం ఆరోగ్యం సర్వనాశనం చేస్తున్నారు. పురుగులుపట్టిన మాంసాన్ని ఫ్రిజ్‌లలో రోజులకొద్దీ మురగబెట్టి నూనెలో బాగా వేయించి భలే రుచి అన్నట్లుగా తయారుచేసి జనం డబ్బు గుంజేసుకుంటున్నారు. ఈ కల్తీ మోసాల కథలు చూస్తే ఎవరికైనా కళ్ళు బైర్లు కమ్ముతాయి. నూనెల్లో కల్తీ, ప్రతి సరుకులోనూ కల్తీ. దానికి తగ్గట్టు అవే అసలైన సరుకులన్నట్లుగా ధరలు పెంచి మరీ అమ్మేసుకునే ధనపిశాచులకు కొదవలేకుండా పోయింది. తాజాగా, కూరగాయలు కూడా కల్తీనే అన్న విషయం కూడా బట్టబయలైంది. పండ్లు-కూరగాయల్లో పురుగుమందుల అవశేషాలు ఉన్నట్లు పరిశోధనల్లో తేలింది. విపరీతంగా పురుగుమందులు చల్లడం వల్ల అవి విషపూరితమవుతున్నాయని స్పష్టమవుతోంది. కేంద్ర ప్రభుత్వ గణాంకాలే ఆ విషయాన్ని ఇటీవల బయటపెట్టాయి కూడా. పరిమితికి మించి పురుగుమందులు ఉపయోగించడం వల్ల వాటితో పెరిగే ఆకుకూరలు కూడా విషతుల్యమవుతున్నాయని, వాటిని తినడం వల్ల తీవ్రమైన జబ్బులు, అనారోగ్య పరిస్థితులు వస్తాయని కూడా కేంద్రం హెచ్చరిస్తోంది. ఇలా కూరగాయలను కూడా క్రూరంగా మార్చే క్రూరత్వం మన సమాజంలో ఇటీవలికాలంలో ఎక్కువైపోయిందని అధ్యయనాలు తేల్చి చెపుతున్నాయి. దేశవ్యాప్తంగా ప్రతిచోటా ఏదోఒక రకంగా కల్తీలు జరిగిపోతూనే ఉన్నాయి. పప్పులు, నూనెలు, పసుపుపొడి, మిరప్పొడి ఒకటేమిటి..దేన్ని చూసినా కల్తీయే. ఇంట్లో చేసుకునే వంట పదార్థాల్లోకి కూడా కల్తీ వచ్చి చేరుతుంటే ఇక చేయగలిగిందేముందని ప్రజలు లోలోపలే ఆందోళన చెందుతున్నారు. బయట హోటళ్ళు, దుకాణాల్లో తినుబండారాలు తింటే ఇక..అంతే సంగతులు. దేనికి తగ్గ కల్తీ దాని కుంటుంది. వీటన్నిటికి మనిషిలోని దురాశే మూలకారణం అన్నది స్పష్టం. సక్రమంగా డబ్బు సంపాదించడం, ధర్మబద్ధంగా వ్యాపారాలు చేయడం వంటివి కనుమరుగైపోయాయి. దొరికినకాడికి దోచుకోవడమే ప్రధానమైపోయింది. అది అక్రమమా-సక్రమమా అన్నది ఎవరూ చూడడం లేదు. 'డబ్బు సంపాదించాలి'..అంతే!..దీంతో అనేకరకాల వ్యాపారాలు పూర్తిస్థాయిలో కల్తీమయమైపోతున్నాయి. వీటిని అరికట్టడం అన్నది ఎవరికీ సాధ్యం కానంత విపరీతమైపోయింది. చిన్నచిన్నగా మొదలైన ఈ కల్తీ వ్యాపారాలు, ఇప్పుడు పెరిగి పెరిగి పెద్ద మాఫియాలుగా, కల్తీ సామ్రాజ్యాలుగా మారాయి. వాటిని నిర్మూలించాలంటే చిన్న విషయమేమీ కాదు. ప్రభుత్వాలు ఎన్ని హుకుంలు జారీచేసినా జరిగే కల్తీ జరిగిపోతూనే ఉంది. ఎవరికి వారు మానవత్వంతో ఉంటే తప్ప, ధర్మబద్ధంగా నడుచుకుంటే తప్ప ఇలాంటి దురాగతాలు ఆగవు. కానీ, దగాకోరులైన ఆ కల్తీదారులు తెలుసుకోవాల్సిన విషయం కూడా ఒకటుంది. తాము చేసే కల్తీల వల్ల జనం ఆరోగ్యం నాశనమైనట్టే, ఆ కల్తీవ్యాపారులు కూడా ఏదోఒక రకం కల్తీకి గురి కావాల్సిందేనన్న వాస్తవం గుర్తుంచుకోవాలి. వారు కూరగాయల్ని కల్తీ చేస్తే, వారు తినే బిర్యానీలలోనో.. మరొక దానిలోనో.. ఎంత కల్తీ ఉందో తెలుసుకునేటప్పటికి.. ఆసుపత్రుల్లో ఉండాల్సిందే. సంపాదించిన ఆ అక్రమ సంపాదనంతా ఆసుపత్రులకి తెచ్చి పెట్టాల్సిందే!.. అన్నీ కల్తీ అయినప్పుడు.. మందులు కూడా కల్తీయే కదా!.. జాగ్రత్త మరి!.. ఆలోచించుకోండి!.. జనం తినే తిండిని కలుషితం చేసి, అమాయక ప్రజల ఆరోగ్యాన్ని బలిచేసి.. ఏం బావుకుంటారు?.. ఇకనైనా కల్తీ వ్యాపారాలు మానుకోండి!.. నిజాయితీగా బతకండి. ఆరోగ్యం అందరికీ ఒకటేనని తెలుసుకోండి. జీవితపు విలువలు తెలుసుకుని..మానవత్వంతో.. మనుషులుగా మసలుకోండి. ఏమంటారు?..

## భారతీయ విద్యా వ్యవస్థపై కేటీఆర్ వ్యాఖ్యలు అభ్యంతరకరం!

ఈ-మెయిల్ ప్రజావాణి
lawyerpatrika@gmail.com
+91 98663 14741

తెలంగాణలో పదేళ్లపాటు కీలకమైన మంత్రిగా, ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న కేటీఆర్.. దేశంలోని విద్యావ్యవస్థ బాగోలేదని, అందుకే తన కుమారుడ్ని ఉన్నత విద్య కోసం విదేశాలకు పంపిస్తున్నానని వ్యాఖ్యానించడం తీవ్రంగా ఆలోచించాల్సిన విషయం.

విద్యావ్యవస్థలో లోపాలు ఉంటే వాటిని ఎత్తిచూపడం తప్పు కాదు. కానీ పదేళ్ల పాటు అధికారంలో ఉన్న వ్యక్తి ఆ వ్యవస్థలోని లోపాలకు బాధ్యత వహించకుండా, ఇప్పుడు విమర్శించడం అర్థరహితం. అధికారంలో ఉన్నప్పుడు విద్యారంగాన్ని బలోపేతం చేయడానికి కేటీఆర్ ఏం వెలగబెట్టిందు..? ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలలో ఉపాధ్యాయుల కొరత, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై ఆయన ఎంత మాత్రం శ్రద్ధ పెట్టిండు? అన్న ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత కూడా ఆయనదే. సోషల్ మీడియాలో ఈ వ్యాఖ్యలపై పెద్దఎత్తున విమర్శలు రావడం కూడా ఇదే అసంతృప్తికి ప్రతిబింబంగా మనం చూడాలి. కేటీఆర్ నిజంగానే భారత విద్యావ్యవస్థలో లోపాలున్నాయని భావిస్తే, వాటిని రాజకీయ విమర్శగా కాకుండా నిర్మాణాత్మక చర్చగా ముందుకు తీసుకురావాలి. తమ కుమారుడి చదువు కోసం విదేశీ విద్యను ఎంచుకోవడం ఆయన వ్యక్తిగత నిర్ణయం. కానీ, అదే సమయంలో దేశంలోని విద్యావ్యవస్థను విమర్శించడం ఆయన చేతగానితనానికి నిదర్శనం. పదేళ్లు అధికారంలో ఉన్న నాయకుడు ఇప్పుడు విద్యావ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తినప్పుడు ప్రజలు కూడా సహజంగానే అధికారంలో ఉన్నప్పుడు ఈ సమస్యలను పరిష్కరించేందుకు తమరు ఏం చేసి న్రయ్యా?" అని నిలదీస్తరు. వారి ప్రశ్నలకు సమాధానం చెప్పడం కేటీఆర్ కనీస బాధ్యత.

– ఎస్.ఎస్.రెడ్డి, హైదరాబాదు.

## వందేమాతరాన్ని కించపరిస్తే.. దేశానికే అవమానం!

న్యూఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జరిగిన జెండా వందన కార్యక్రమంలో 'వందేమాతరం' గేయాలాపనకు సోనియా గాంధీ అడ్డుపడ్డారంటూ వెలువడిన వీడియో దృశ్యాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. 'వందేమాతరం' కేవలం గేయం కాదు. భారత స్వాతంత్ర్య పోరాటానికి ప్రతీక. ఒకవేళ విచారణలో ఉద్దేశపూర్వకంగా 'వందేమాతరం' గేయాలాపనకు ఆటంకం కలిగించారని నిర్ధారణ అయితే, అది కేవలం రాజకీయ వివాదంగా కాకుండా జాతీయ గౌరవానికి సంబంధించిన తీవ్రమైన అంశంగా పరిగణించాలి. చట్టం వర్తించే పరిస్థితి ఉంటే, చట్టప్రకారం తగిన చర్యలు తీసుకోవాలి. అంతకంటే ముఖ్యంగా, ప్రజల ముందు స్పష్టమైన వివరణ మరియు క్షమాపణ చెప్పాల్సిన నైతిక బాధ్యత కూడా ఉంటుంది. దేశభక్తి అనేది ఏ ఒక్క రాజకీయపార్టీకి చెందిన ఆస్తి కాదు. 'వందేమాతరం'పై గౌరవం కూడా రాజకీయ రంగు పులుముకోకూడదు. జాతీయ చిహ్నాల పట్ల గౌరవం విషయంలో అధికారపక్షమైనా, ప్రతిపక్షమైనా ఒకే ప్రమాణం ఉండాలి. ఈ ఘటనపై నిజానిజాలు వెలుగులోకి వచ్చి, రాజకీయాలకు అతీతంగా జాతీయ గౌరవాన్ని కాపాడే విధంగా తగిన నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాను.

– కే.సురేష్‌కుమార్, చెన్నై.

# ప్రకృతి తర్వాతే ఏదైనా...



అభివృద్ధి అంటే పర్యావరణాన్ని ఫణంగా పెట్టడం కాదని భారత సర్వోన్నత న్యాయస్థానం సంచలనాత్మకమైన, అత్యంత కీలకమైన తీర్పును వెలువరించింది. ప్రాజెక్టులు నిర్మించిన తర్వాత లేదా పనులు ప్రారంభించిన తర్వాత పర్యావరణ అనుమతులు పొందే 'ఎక్స్ పోస్ట్ ఫ్యాక్టో' విధానానికి చరమగీతం పాడుతూ సుప్రీంకోర్టు ఇటీవల వనశక్తి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో చారిత్రాత్మకమైన నిర్ణయాన్ని ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వం గతంలో జారీచేసిన పరిపాలనా ఉత్తర్వులను (ఆఫీస్ మెమోరాండమ్) రద్దు చేస్తూ, పర్యావరణ అనుమతులు అనేది ప్రాజెక్టు ప్రారంభానికి ముందే పొంది తీరాల్సిన ప్రాథమిక నిబంధన అని ధర్మాసనం స్పష్టం చేసింది. భారత రాజ్యాంగం పౌరులకు అందించిన అత్యున్నతమైన జీవించే హక్కు (ఆర్టికల్ 21), సమానత్వ హక్కు (ఆర్టికల్ 14)ల స్ఫూర్తికి ఈ వెనుకటి తేదీల అనుమతులు పూర్తి విరుద్ధమని వ్యాఖ్యానించిన కోర్టు, ముందు పర్యావరణానికి నష్టం కలిగించి, ఆ తర్వాత జరిమానాలు చెల్లించి క్రమబద్ధీకరించుకునే పద్ధతి పర్యావరణానికి జీవావరణానికి, ముప్పుగా మారిందని ఆందోళనను వ్యక్తం చేసింది.

భారతదేశంలో 2006 నాటి 'ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్' (EIA) నోటిఫికేషన్ ప్రకారం ఏదైనా పెద్ద మౌలిక వసతులు లేదా పారిశ్రామిక ప్రాజెక్టు ప్రారంభించే ముందే పర్యావరణ ప్రభావ అంచనా వేసి అనుమతి పొందాల్సి ఉంటుంది. అయితే, ముందస్తు అనుమతి లేకపోయినా పనులు ప్రారంభించి, ఆ తర్వాత కార్యనిర్వాహక ఉత్తర్వుల ద్వారా వాటిని సులభంగా క్రమబద్ధీకరించుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పరిపాలనా మార్గదర్శకాలను అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా తప్పుబట్టింది. ఒక చట్టబద్ధమైన నోటిఫికేషన్‌ను కేవలం ఒక సాధారణ పరిపాలనా ఉత్తర్వు ద్వారా సవరించడం లేదా, దాని ప్రాధాన్యతను తగ్గించడం చట్ట విరుద్ధమని తేల్చి చెప్పింది. బహుళజాతి కంపెనీలు చట్టాలను అతిక్రమించి నిర్మాణాలు చేపట్టి ఆ తర్వాత క్రమబద్ధీకరించుకునే అడ్డదారుల సంస్కృతికి కోర్టు గట్టి చెక్ పెట్టింది.

ఈ కీలక నిర్ణయం వెనుక సుదీర్ఘమైన, సంక్లిష్టమైన న్యాయ పోరాటం సాగింది. వెనుకటి తేదీల అనుమతులను నిలిపివేస్తే వేల కోట్ల రూపాయల ప్రభుత్వ, ప్రైవేటు ప్రాజెక్టులు, ఆసుపత్రులు, విమానాశ్రయాల నిర్మాణాలు నిలిచిపోతాయని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్రమైన ప్రతికూల ప్రభావం చూపుతుందని పారిశ్రామిక వర్గాలు వాదనలు వినిపించాయి. అయితే, ప్రకృతికి జరిగే నష్టం ఏ రూపంలోనూ పూడ్చలేనిదని, చెట్లను నరికి, నదుల ఉనికిని దెబ్బతీసి, జీవావరణాన్ని నాశనం చేసిన తర్వాత వికసించే ఏ అభివృద్ధి కూడా ప్రజా ప్రయోజనం కాజాలదని కోర్టు స్పష్టం చేసింది. చట్టాన్ని అతిక్రమించిన వారి ఆర్థిక ప్రయోజనాల కోసం పర్యావరణ ప్రయోజనాలను పక్కన పెట్టడం రాజ్యాంగ విరుద్ధమని అత్యున్నత న్యాయస్థానం విస్పష్టంగా పేర్కొంది.


ఈ తీర్పు భారతీయ మౌలిక సదుపాయాల రంగానికి స్వల్పకాలికంగా ఒక పెద్ద సవాలుగా అనిపించినప్పటికీ, సుస్థిర అభివృద్ధి సాధనకు ఇది అత్యంత ఆవశ్యకమైన మలుపు. ఇకపై ప్రాజెక్టుల రూపకల్పన దశలోనే పర్యావరణ వ్యయాన్ని, నష్ట పరిహారాన్ని లెక్కించడం డెవలపర్లు మరియు పెట్టుబడిదారులకు తప్పనిసరి అవుతుంది. అంతేకాకుండా, ముందస్తు అనుమతి ప్రక్రియలో స్థానిక ప్రజలు, పర్యావరణ వేత్తల అభిప్రాయాలను సేకరించే ప్రజాస్వామ్య హక్కు తిరిగి బలపడుతుంది. అత్యంత ప్రజా ప్రాముఖ్యత ఉన్న మినహాయింపుల విషయంలో చట్టసభలు మాత్రమే నిర్దిష్టమైన చట్టబద్ధ నిబంధనలు తేగలవు తప్ప, అధికారులు యథేచ్ఛగా క్రమబద్ధీకరించే పద్ధతి చెల్లదని ఈ తీర్పు స్పష్టం చేసింది.

ఈ చారిత్రాత్మక తీర్పు కేవలం పారిశ్రామిక రంగానికే కాకుండా, దేశంలోని నగరాల ప్రణాళికలు, రియల్ ఎస్టేట్ రంగంలో పారదర్శకతను తీసుకువస్తుంది. ఇప్పటివరకు అనేక భారీ ప్రాజెక్టులు ముందస్తు అనుమతులు లేకుండానే సగం పనులు పూర్తి చేసి, ఆపై న్యాయపరమైన రక్షణలు కోరడం పరిపాటిగా మారింది. సుప్రీంకోర్టు నిర్ణయం వల్ల ఇటువంటి బాధ్యతారాహిత్యమైన ధోరణులకు అడ్డుకట్ట పడడమే కాకుండా, పెట్టుబడిదారులు చట్టపరిధిలోనే తమ ప్రణాళికలను రూపొందించుకోవాల్సిన తప్పనిసరి పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం కూడా పర్యావరణ అనుమతుల ప్రక్రియలో జరిగే అనవసర జాప్యాన్ని నివారించేందుకు యంత్రాంగాన్ని మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉంది. డిజిటల్ వ్యవస్థలు, ఒకే గొడుగు కింద అనుమతులు ఇచ్చే సింగిల్ విండో విధానాల ద్వారా పారదర్శకంగా, వేగంగా ముందస్తు అనుమతులు ఇచ్చే ప్రక్రియను బలోపేతం చేయాలి.

వాతావరణ మార్పుల వల్ల సంభవిస్తున్న అకాల వర్షాలు, భయంకరమైన వరదలు, మునుపెన్నడూ లేని వేడి గాలులతో దేశం ప్రతికూల వాతావరణ పరిస్థితులను ఎదుర్కొంటున్న ఈ సమయంలో పర్యావరణ చట్టాలను కచ్చితంగా అమలు చేయడం తప్పనిసరి. రాబోయే తరాల జీవించే హక్కును కాపాడే రాజ్యాంగ బాధ్యత కూడా. అభివృద్ధి పేరుతో పర్యావరణాన్ని నాశనం చేయకుండా పర్యావరణ పరిరక్షణతో కూడిన బాధ్యతాయుత ప్రగతి సాధించటం ముఖ్యం. సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ఆదేశం, చట్ట ఉల్లంఘనులకు అభయహస్తం ఇచ్చే సంస్కృతికి చరమగీతం పాడుతూ, దేశంలో పర్యావరణ పరిపాలనకు కొత్త ఊపిరి పోసిన ఒక చారిత్రక మైలురాయిగా నిలిచిపోతుంది.



– తుమ్మల బాల గంగాధర్ తిలక్



# ఆనందోత్సవంగా.. జెండా పండుగ!

## సంబరాల మధ్య.. 80వ స్వాతంత్ర్యదినోత్సవం



జెండా వందనం చేస్తున్న మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల తదితర అధికారులు

***నెల్లూరులోని పోలీస్ పరేడ్ మైదానంలో ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు అట్టహాసంగా జరిగాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు, వేలాదిమంది విద్యార్థులు, ప్రజల మధ్య 80వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు ఆనందోత్సవంగా నిర్వహించారు. శకటాల ప్రదర్శన, విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు, దేశభక్తితో చేసిన అనేక రకాల కళాప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా, విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభతో రాణిస్తున్నవారికి, సమాజానికి ఉత్తమసేవలందిస్తున్న వారికి అవార్డులనిచ్చి అభినందించారు. పోలీసు అధికారులకు ఉత్తమసేవా పతకాలను బహూకరించారు.***

ఈసారి 80వ స్వాతంత్ర్యదినోత్సవ వేడుకలు మునుపటి కంటే వేడుకగా జరిగాయి. విద్యార్థుల కళారూపాల్లో, ప్రదర్శనల్లో దేశభక్తి వెల్లివిరిసింది. తొలుత, రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ జాతీయ పతాకాన్ని ఎగురవేసి, జెండా వందనం చేశారు. జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్లతో కలిసి మంత్రి పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మంత్రి నారాయణ 80వ స్వాతంత్ర్య దినోత్సవ సందేశాన్ని, జిల్లా ప్రగతి నివేదికను ప్రజలకు వివరించారు. వికసిత్‌భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలతో జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. అటు రైతాంగం అభ్యున్నతికి, ఇటు పరిశ్రమల అభివృద్ధికి చేయూతనిస్తూ ప్రభుత్వం జిల్లాను అన్నిరంగాల్లో ముందుకు నడిపిస్తోందన్నారు.

### ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు :



విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉత్తమ సేవలందించిన అధికారులు, సిబ్బందికి, వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన కళాకారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు ప్రశంసా పత్రాలను, పోలీసు అధికారులకు సేవా పతకాలను మంత్రి నారాయణ అందజేశారు. శకటాల ప్రదర్శనలో నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ శకటానికి మొదటి స్థానం, పంచాయతీరాజ్ మరియు గ్రామీణ నీటి సరఫరా శాఖల శకటాలకు ద్వితీయ స్థానం, జిల్లా వ్యవసాయ శాఖ, పరిశ్రమల శాఖ శకటాలకు తృతీయ స్థానం లభించాయి.

# శ్రీసిటీలో.. స్వాతంత్ర్య వేడుకలు



సైన్ లాంగ్వేజ్ లో జాతీయ గీతం ఆలపిస్తున్న బధిర యువత

ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసిటీలో వేడుకలను ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీసిటీ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ బి.వి.శ్రీనివాసులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి, శ్రీసిటీ సెక్యూరిటీ సిబ్బంది కవాతు ద్వారా గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన దేశస్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుంటూ నివాళులర్పించారు. సెక్యూరిటీ అండ్ విజిలెన్స్ విభాగం ఏజీఎం రమేష్, కస్టమర్ రిలేషన్స్ వైస్ ప్రెసిడెంట్ రమేష్ కుమార్ సభను ఉద్దేశించి ప్రసంగించారు. వేడుకల్లో భాగంగా సీఆర్‌సీఎల్ క్యాటరింగ్ సంస్థకు చెందిన కుమారేశన్‌కు ప్రశంసా పురస్కారం అందజేశారు. అనారోగ్యానికి గురైన ఓ ఉద్యోగిని సకాలంలో ఆసుపత్రికి తరలించేందుకు ఆయన అందించిన సహాయాన్ని గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు. అదేవిధంగా, 35 మంది సిబ్బందితో పాటు స్థానిక పోలీసు సిబ్బందికి వారి ఉత్తమ సేవలకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ వేడుకల్లో పరిసర గ్రామాల ప్రజలు పాల్గొని కోలాటం, సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు.

### శ్రీసిటీ శకటానికి ప్రథమ బహుమతి :



తిరుపతిలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ పరేడ్‌లో ఏపీఐఐసీ ఆధ్వర్యంలో ప్రదర్శించిన శ్రీసిటీ శకటానికి ప్రథమ బహుమతి లభించింది. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, ప్రపంచ స్థాయి పెట్టుబడులను ఆకర్షించడంలో, భారీగా ఉపాధి అవకాశాలను కల్పించడంలో, ప్రభుత్వ ఆదాయాన్ని పెంపొందించడంలో శ్రీసిటీ పోషిస్తున్న కీలక పాత్రను ప్రశంసించారు. ఈ సందర్భంగా శ్రీసిటీ వ్యవస్థాపక మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి అందరికీ స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు చెప్తూ, శ్రీసిటీ శకటం ప్రథమ బహుమతి సాధించినందుకు ఏపీఐఐసీ, జిల్లా పరిశ్రమల కేంద్రం మరియు శ్రీసిటీ బృందాన్ని అభినందించారు.

# డిఎస్ఆర్ హైస్కూలులో..జెండా వందనం

నెల్లూరులోని దేవిరెడ్డి శారద హైస్కూలులో 80వ స్వాతంత్ర్యదినోత్సవం వేడుకంగా జరిగింది. ముఖ్య అతిథిగా నెల్లూరు జిల్లా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ కే.వేమారెడ్డి మరియు అల్లూరు మండల రెవెన్యూ ఆఫీసర్ ఏ.నవీన్‌కుమార్ పాల్గొని త్రివర్ణ పతాకాన్ని ఎగురువేసి జెండా వందనం చేశారు. డీఎస్ఆర్‌ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ దేవిరెడ్డి దశరథరామిరెడ్డి, ట్రస్ట్ సీఈవో ఇందూపూరు అనిల్‌కుమార్‌రెడ్డి, స్కూల్ ప్రిన్సిపల్ మలినేని శ్రీలత చౌదరి తదితరులు పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న డీఎస్పీ వేమారెడ్డి, ఎమ్మార్వో నవీన్‌కుమార్, స్కూల్ సిబ్బంది

## 16,400 టీచర్ ఉద్యోగాల భర్తీ..

# నారా లోకేష్ ఘనతే!

### - అసెంబ్లీలో మాజీమంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి -



రాష్ట్ర విద్యా శాఖ మంత్రిగా 16,400 టీచర్ల పోస్టులతో డీఎస్సీ విజయవంతంగా నిర్వహించిన ఘనత లోకేష్‌బాబుదేనని మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి కొనియాడారు. ఇటీవల అసెంబ్లీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, టీచర్ల పోస్టుల భర్తీలో లోకేష్ ఒక బ్రాండ్ అన్నారు. త్వరలోనే వేలాదిగా ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి మళ్లీ మరో నోటిఫికేషన్ ఇవ్వబోతున్నారని ఆయన తెలిపారు. ఐటీ శాఖ మంత్రిగా లోకేష్ విదేశాల్లో సైతం తన ప్రత్యేకతను చాటుకుంటున్నారని, ఆయన చురుకుదనం, పట్టుదల చూసి కేంద్రమంత్రులతో సమానంగా ప్రాధాన్యం పొందడం విశేషమన్నారు. నెల్లూరుజిల్లాలోని విక్రమ సింహపురి యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభించినందుకు ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా, గొలగమూడిలోని బీసీ గురుకులంలోనూ జూనియర్ కళాశాల మంజూరు చేసినందుకు లోకేష్ బాబుతో పాటు సవితమ్మకు కూడా ప్రత్యేక కృతజ్ఞతలన్నారు. డీఎస్సీ పేరుతో వైసీపీ చేసిన డ్రామాలన్నీ అట్టర్ ఫ్లాఫ్ అయ్యాయని, అదే సమయంలో డీఎస్సీ ఉపాధ్యాయులు చేసిన ర్యాలీలు విజయవంతంగా జరుగుతున్నాయని ఆయన అన్నారు.

# ఉత్తమ పోలీసులకు.. సేవా పతకాలు

నెల్లూరు జిల్లాలో విధి నిర్వహణలో ఉత్తమసేవలందించిన పోలీసు అధికారులకు, సిబ్బందికి మంత్రి నారాయణ ఉత్తమ సేవాపతకాలను అందజేశారు. ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్యదినోత్సవం సందర్భంగా నెల్లూరు పోలీసు పెరేడ్‌గ్రౌండ్‌లో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజిత వేజెండ్ల సమక్షంలో వారు ఆ అవార్డులను అందుకున్నారు. డీసీఆర్‌బీ ఎస్‌ఐ ఎన్.శ్రీనివాస్‌సింగ్ ఉత్తమ సేవా పతకం అందుకున్నారు. అదేవిధంగా సేవాపతకాలు అందుకున్నవారిలో నెల్లూరు రూరల్ డీఎస్పీ జి.శ్రీనివాసరావు, ఆర్‌ఐ జె.హరిబాబు, మహిళా పోలీస్‌స్టేషన్ ఏఎస్‌ఐ ఇ.శ్రీనివాసులు, విశ్రాంత ఏఎస్‌ఐ చెంగయ్య, ఏఆర్ ఏఎస్‌ఐ ఎస్‌డీ జిలానీబాషా, విశ్రాంత సివిల్ ఏఆర్ హెచ్‌సీలు కె.హజరత్, పి.మాలకొండయ్య, జి.చంద్రశేఖర్, విశ్రాంత పీసీ సి.జయంతికుమార్, నవాబుపేట పీసీ షేక్ సుల్తాన్ మొహిద్దీన్, ఏఆర్ పీసీ పి.సన్యాసినాయుడు ఉన్నారు.

మహిళాపోలీస్‌స్టేషన్, విడవలూరు ఏఎస్‌ఐలు ఇ. శ్రీనివాసులు, పి.వెంకటేశ్వరరావు, విశ్రాంత పీసీ బి.జయంత్‌కుమార్, కావలి రూరల్ పీసీ కె. పి చంద్రబాబు, డీసీఆర్‌బీ ఏఆర్ హెచ్‌సీలు ఏ శిఖామణి, డి.సత్యనారాయణరావు, ఎస్‌కే ఆరిఫ్, పి.శ్రీనివాసుల, జి.చౌడయ్య, ఎన్. వెంకటసుబ్బారావు, ఎంవీ రమణయ్య, సీహెచ్ మీరా, నవాబుపేట పీసీ షేక్ సుల్తాన్‌మొహిద్దీన్‌లు అతి ఉత్కృష్ట పతకాలను అందుకున్నవారిలో ఉన్నారు. ఉత్కృష్ట సేవాపతకాలను అందుకున్నవారిలో సంతపేట, సీసీఎస్, సౌత్‌ట్రాఫిక్, డీసీఆర్‌బీ, ఆత్మకూరు ఏఆర్‌హెచ్‌సీలు టి.భాస్కర్, ఎన్.రమేష్‌బాబు, ఎస్.రమణయ్య, బి.మహేష్ కుమార్, పి.శ్రీనివాసులు, డి.చంద్రశేఖర్, పి.శీనయ్య, కె.చెంగయ్య, పి.భాస్కర్‌రావు, వి.గోపాల్, డీసీఆర్‌బీ, వేదాయపాళెం, కోవూరు నార్త్‌ట్రాఫిక్, జలదంకి, చిన్నబజారు, అల్లూరు ఏఆర్ పీసీలు జి.మస్తాన్‌బాబు, ఎస్‌డీ ఖాజాపీర్, పి.సతీష్‌కుమార్, పి.నాగరాజు, సీహెచ్ శ్రీనివాసులు, ఎస్.వెంకటశ్యామ్‌ప్రసాద్, టి.శ్రీకాంత్, ఎం.మాల్యాద్రి, ముత్తుకూరు–చిన్నబజారు–కావలి గ్రామీణం మహిళా కానిస్టేబుళ్లు సిహెచ్ భవాని, ఆర్.అనూరాధ, షేక్ జరీనా ఉన్నారు. బెస్ట్ పెరేడ్ కమాండర్‌గా ఆర్ఎస్‌ఐ తిరుమలరెడ్డి ఉత్తమసేవలకు అవార్డును అందజేశారు.

# 'అపోలో'లో.. అతిపెద్ద డయాలసిస్ కేంద్రం



కాలానికి అనుగుణంగా వైద్య సేవలతో పాటే ఆధునాతనమైన వైద్య పరికరాలను అపోలో ఆసుపత్రి అందుబాటులోకి తీసుకొస్తోంది. ప్రపంచ అవయవ దాన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఇటీవల నెల్లూరులోని అపోలో ఆసుపత్రిలో అతిపెద్ద డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటుచేయడం విశేషం. ఆసుపత్రి నెఫ్రాలజీ విభాగం అధిపతి డాక్టర్ ఏ.కె.చక్రవర్తి, డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్‌సతీష్, యూనిట్ హెడ్ విశ్వేశ్వర్ రెడ్డి తదితరులు ఈ నూతన విభాగాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రైవేట్ ఆసుపత్రుల్లో అతిపెద్ద డయాలసిస్ కేంద్రం నెల్లూరులోని అపోలో హాస్పిటల్‌లో ఏర్పాటు చేయడం గర్వకారణంగా భావిస్తున్నామన్నారు. నెల్లూరు కేంద్రంగా అపోలో హాస్పిటల్ ప్రారంభించిన ఎనిమిదిన్నరేళ్ళ కాలంలో 125 కిడ్నీ మార్పిడి ఆపరేషన్లను విజయవంతంగా నిర్వహించామన్నారు. నెఫ్రాలజీ వైద్యులు మస్తాన్‌వలీ, డాక్టర్ రాకేష్, యూరాలజీ వైద్యులు నిశ్చల్ ప్రసాద్‌రెడ్డి, డాక్టర్ రంగనాథన్, అనస్థీషియా విభాగం అధిపతి డాక్టర్ రాజమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

## 3.25 కోట్లతో డ్రైన్లకు శంకుస్థాపన

నెల్లూరు రూరల్ నియోజక వర్గం పరిధిలోని 33వ డివిజన్ వెంగళరావు నగర్, ఎ-బ్లాక్‌లో ఇటీవల 3 కోట్లా 25లక్షల రూపాయలతో సి.సి. డ్రైన్ పనులకు అంకురార్పణ జరిగింది. తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి పాల్గొని శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 33వ డివిజన్ అభివృద్ధికి ప్రభుత్వం 7 కోట్ల 25 లక్షల రూపాయల నిధులు వెచ్చిస్తున్నట్లు ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

## గౌతు లచ్చన్న సేవలు చిరస్మరణీయం

స్వాతంత్ర్య సమరయోధుడు.. సర్దార్ గౌతు లచ్చన్న సేవలు చిర స్మరణీయమని జిల్లా గౌడసంక్షేమ సంఘం అధ్యక్షుడు టి. శీనయ్య అన్నారు. గౌతు లచ్చన్న 118వ జయంతి సందర్భంగా ఈనెల 16న నెల్లూరు బీవీనగర్‌లోని గౌడసంఘం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ఆయనకి నివాళులర్పించారు. నాయకులు అన్నం దయాకరగౌడ్, దద్దోలు చక్రపాణి, ముక్కు రాధాకృష్ణగౌడ్, జడపల్లి రాజారావుగౌడ్ పాల్గొన్నారు.

## ఉత్తమ వైద్యులకు పురస్కారాలు

ఆగస్టు15న 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నెల్లూరులో జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో మంత్రి నారాయణ చేతులమీదుగా పలువురు ఉత్తమ వైద్యులు పురస్కారాలు అందుకున్నారు. డాక్టర్ బిందు మీనన్ మరియు డాక్టర్ శ్రీరామ్ సతీష్ ఉత్తమ వైద్యుల పురస్కారాలు అందుకున్నవారిలో ఉన్నారు.

## సమాచారశాఖలో అధికారులకు అవార్డులు

జిల్లా సమాచార పౌర సంబంధ శాఖలో విశిష్ట సేవలు అందిస్తున్నందుకుగాను జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి పి.వేణుగోపాల్‌రెడ్డికి స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఉత్తమ పురస్కారం అందుకున్నారు. 80వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా నెల్లూరు పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆయనకు ప్రశంసా పత్రం అందచేశారు. అదేవిధంగా, సమాచార శాఖలో పిఆర్ఓగా పని చేస్తున్న వి.వినోద్‌కుమార్, ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్‌గా ఉత్తమ సేవలు అందిస్తున్న షేక్ కాలేషాలు కూడా మంత్రి చేతులమీదుగా పురస్కారాలను అందుకున్నారు.

# నెల్లూరు కబుర్లు

## ప్రజలకు రుణ సౌకర్యాలు పెంచాలి

### - - బ్యాంకర్ల సమావేశంలో ఎంపీ వేమిరెడ్డి - -



జిల్లాలో బ్యాంకర్ల ప్రజలకు విస్తృతంగా రుణాలను అందించాలని, నరసరావుపేట తరహాలో జిల్లాలోనూ క్రెడిట్ అవుట్‌రీచ్ నిర్వహణకు సన్నద్ధం కావాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి సూచించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమితి, జిల్లా స్థాయి రివ్యూ కమిటీ సమావేశాలను జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు బ్యాంకర్లు, అధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. బ్యాంకులు కేవలం వ్యాపార దృక్పథంతోనే కాకుండా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు సమాజంలో మంచి పాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్షు శుక్ల మాట్లాడుతూ, జిల్లాలో రూ.4 వేల కోట్ల రుణాలను ప్రజల అవసరాలకు అందించేలా క్రెడిట్ అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కృషి చేస్తామని, అందుకు రాష్ట్రస్థాయి బ్యాంకర్ల సమితి సహకారం తీసుకుంటామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మణిశేఖర్, నాబార్డు డీడీఎం బాబు, జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణి తదితర అధికారులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యయోధుల దేశభక్తి అపూర్వం

### జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ



మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ

ఆగస్టు 15 సందర్భంగా నెల్లూరు జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో జడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆధ్వర్యంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. జెండా వందనం తర్వాత ఆమె మాట్లాడుతూ, స్వాతంత్ర్యయోధుల దేశభక్తి అపూర్వమన్నారు. ఎందరో స్వాతంత్ర్యవీరుల త్యాగాలు, పోరాటాల ఫలితంగా మనకు స్వాతంత్ర్యం లభించిందని, వారి త్యాగాలను స్మరించుకుంటూ, దేశ సమగ్రత, ఐక్యత, ప్రజాస్వామ్య విలువలను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని చెప్పారు. దేశ భవిష్యత్తుకు యువత బలమైన పునాది అని, విద్య, నైపుణ్యం, క్రమశిక్షణ, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులు, యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సిఇఒ తదితర అధికారులు పాల్గొన్నారు.

## గణేష్ ఉత్సవ సమితి..కొత్త కమిటీ



నెల్లూరుజిల్లా గణేష్ ఉత్సవ సమితికి నూతన కమిటీ ఏర్పడింది. ఇటీవల నెల్లూరులోని వారాహి కన్వెన్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షులు చలసాని ఆంజనేయులు, ఉపాధ్యక్షులు భయ్యా వాసు కొత్తకమిటీని ప్రకటించారు. అధ్యక్షులుగా వాయుగుండ్ల వెంకటేశ్వర్లును నియమించారు. ఉపాధ్యక్షులుగా వేలూరు మహేష్, మధుసూదన్ రెడ్డి, రాఘవ రంగదాం, వడియాల శ్రీహరి, జెట్టి గోపిరెడ్డి, ఉచ్చి భువనేశ్వర్ ప్రసాద్, కార్యదర్శిగా గడ్డం విజయ కుమార్, అమర్నాథ్‌రెడ్డి, సాంస్కృతిక కార్యదర్శిగా అమరావతి కృష్ణారెడ్డి, కోశాధికారి ఏవిఆర్ మోహన్‌రావు ఇమ్మిడిశెట్టి సురేష్‌తో పాటు పలువురు సభ్యులను ప్రకటించారు. విక్రమ సింహపురి గణేష్ ఉత్సవ సమితి గౌరవాధ్యక్షులు పిట్టి సత్యనాగేశ్వరరావు, అధ్యక్షులు కొండపల్లి శ్రీకాంత్ ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిద్ధి వినాయక ఆలయానికి .. మంత్రి భూమిపూజ



దేవాలయ పునఃనిర్మాణానికి భూమి పూజ చేస్తున్న మంత్రి నారాయణ దంపతులు

నెల్లూరు నగరంలోని 50వ డివిజన్ బుజ్జమ్మ రేవు సమీపంలో 40 లక్షల రూపాయల వ్యయంతో సిద్ధి వినాయక ఆలయ పునఃనిర్మాణానికి తన సతీమణి రమాదేవితో కలసి మంత్రి నారాయణ ఇటీవల భూమి పూజ చేశారు. ఎన్నికల ప్రచారంలో కప్పిర రేవతి, శీనయ్య కోరిక మేరకు తాను ఇచ్చిన హామీ మేరకు ఇప్పుడు అందుకు సహాయ సహకారాలు అందిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మేయర్ సుజాత, కమిషనర్ నందన్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్,రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు, నగర టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు కపిర రేవతి తదితరులు పాల్గొన్నారు.

## మహనీయుల త్యాగాలు మరువలేనివి

### • ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి





నెల్లూరులోని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి కార్యాలయంలో ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు సంబరంగా జరిగాయి. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి పాల్గొని జెండాను ఎగురవేసి, వందనం సమర్పించారు. స్వాతంత్ర్యయోధుల సమరశీలతను, ఆ మహనీయుల దేశభక్తి, త్యాగాలు మరువలేనివన్నారు. క్లస్టర్ ఇంచార్జీలు జలదంకి సుధాకర్, సాబీర్‌ఖాన్, రూరల్ నియోజకవర్గం టీడీపీ యువత అధ్యక్షుడు నందిపాటి శ్యామ్, మునీర్ సుభాష్ పాల్గొన్నారు.

## సాయుధ దళాల నిధికి.. 20లక్షల విరాళం



కలెక్టర్‌కి విరాళం చెక్కుని అందజేస్తున్న సుభాషిణి

సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి నెల్లూరు ఆదిత్యనగర్‌కి చెందిన ఆర్.సుభాషిణి ఈనెల 17న 20 లక్షల రూపాయలను విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లకి అందించారు. తన తండ్రి.. ఆర్మీలో డాక్టర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారని, ఆయన జ్ఞాపకార్థం ఈ విరాళం అందజేస్తున్నామని ఆమె తెలిపారు. కలెక్టర్ ఆ దాతను అభినందించారు.

## వీఆర్‌సిలో వాకర్స్ సంబరాలు



ఆగస్టు 18నాటికి వాకర్స్ ఇంటర్నేషనల్ సంస్థ 40 సంవత్సరాలు పూర్తిచేసుకున్న నేపథ్యంలో ఈనెల 18న నెల్లూరులోని వీఆర్‌సి గ్రౌండ్‌లో సంబరాలు జరిగాయి. వాకర్స్ అందరూ కొత్త టీషర్టులు ధరించి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ర్యాలీ నిర్వహించి, కేకు కట్‌చేసి అందరికీ పంచారు. అధ్యక్షులు ఎన్.నళినిమోహన్, 'అమ్మ' సుధాకర్‌రెడ్డి, మాజీ వాకర్ ఇంటర్నేషనల్ అధ్యక్షులు నేతాజీ సుబ్బారెడ్డి, వాకర్ గవర్నర్ నలుబోలు బలరామయ్యనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఓనం పండుగ సందడి

నెల్లూరు పురమందిరంలో ఈనెల 16న ఓనం పండుగ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. నెల్లూరు మలయాళీ సంఘం ఆధ్వర్యంలో కేరళ సంప్రదాయ రీతిలో జరిగిన ఈ వేడుకల్లో కేరళ యువతులు పాల్గొని రంగవల్లులతో పురమందిర ప్రాంగణాన్ని శోభాయమానం చేశారు. సంప్రదాయ నృత్యాలతో అందరినీ అలరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జీ.గోపి, ఛైర్మన్ మురుగన్, కార్యదర్శి మధు, కోశాధికారి సిదోష్, ఏఐఎంఏ పిఆర్ఓ సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కనీసవేతనం.. 30వేలకు పెంచాలి

కార్మికులకు కనీసవేతనం 30వేలకు పెంచాలంటూ భారతీయ మజ్దూర్‌సంఘ్ చేస్తున్న దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా ఈనెల 17న నెల్లూరులో కార్మికులు చలో కలెక్టరేట్ నిర్వహించారు. ఇపిఎఫ్ వేతన పరిమితి 30వేలకి, ఈఎస్ఐ పరిమితి 42 వేలకి పెంచాలని వారు డిమాండ్ చేశారు. కార్మికులకు పాత పెన్షన్ విధానం అమలుచేయాలన్నారు. ఆమేరకు వారు బీఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మన్నెం రాము, కార్యదర్శి సుధాకర్‌ల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు.

## దివ్యాంగులకి ఉపకరణాలు

నెల్లూరు జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ నేతృత్వంలో ఈనెల 17న పలువురు దివ్యాంగులకు ఉపకరణాలు అందజేశారు. జడ్పీ నిధులు 1.85 లక్షలతో మూడుచక్రాల వాహనాలు, వినికిడి యంత్రాలు, బ్యాటరీ మోటార్ సైకిల్ వగైరాలను ఆమె దివ్యాంగులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఇఒ వసుమతి తదితరులు పాల్గొన్నారు.

## మూలస్థానేశ్వరునికి.. 10.63 లక్షల రాబడి

నెల్లూరు మూలాపేటలో వున్న శ్రీ మూలస్థానేశ్వరాలయానికి గత మార్చి 26 నుంచి ఈనెల 17వరకు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా వచ్చిన హుండీ రాబడి 10,63,770 రూపాయలు వచ్చినట్లు ఆలయ ఇఒ అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## కలెక్టరేట్ ఎదుట దీక్ష

అంగన్‌వాడీ వర్కర్లకు, మధ్యాహ్నభోజనం కార్మికులకు, పాఠశాల ఆయాలు, వాచ్‌మెన్లకు పెండింగ్‌లో ఉన్న బకాయిలు చెల్లించాలంటూ ఈనెల 17న ఆ కార్మికుల సంఘం నాయకురాలు రెహానాబేగం ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేపట్టారు. మెగా పేరెంట్స్ డే ఖర్చులను కూడా చెల్లించాలని డిమాండ్ చేశారు.



# మన వెంకయ్య కథ..హిందీలో!

భారత 13వ ఉప రాష్ట్రపతి, నెల్లూరు ముద్దుబిడ్డ మన వెంకయ్యనాయుడి జీవితచరిత్ర "వెంకయ్య నాయకుడు" హిందీలో కూడా ఆవిష్కరించబడింది. 'జనప్రియ నేత వెంకయ్యనాయుడు.. ఉదయగిరి నుంచి ఉప రాష్ట్రపతి దాకా'.. అంటూ ప్రముఖ రచయిత.. మాజీఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ హిందీలో అనువదించిన పుస్తకాన్ని ఈనెల 17 సోమవారం నాడు న్యూఢిల్లీలో కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్‌నబీన్‌లు ఆవిష్కరించారు. డాక్టర్ అంబేద్కర్ ఆడిటోరియంలో జరిగిన ఈ ఆవిష్కరణోత్సవంలో, పుస్తక రచయిత (అనువాద కర్త) యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌తో పాటు, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, వెంకయ్యనాయుడి కుమార్తె దీపా వెంకట్, కోడలు రాధ తదితరులు పాల్గొన్నారు.

# బీద రవిచంద్ర ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సంబరాలు



ఆగస్టు 15 స్వాతంత్ర్యదినోత్సం సందర్భంగా నెల్లూరులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో టీడీపీ జిల్లా శాఖ అధ్యక్షుడు, శాసన మండలి సభ్యుడు బీద రవిచంద్ర ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సంబరాలు జరిగాయి. టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొని జాతీయ గీతం ఆలపించి, జాతీయ జెండాకు గౌరవ వందనం చేసిన అనంతరం మిఠాయిలు పంచారు. టీడీపీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాలతో నివాళులర్పించారు. రాష్ట్ర ఇన్లాండ్ వాటర్ వేస్ ఛైర్మెన్ జడ్.శివప్రసాద్, రాష్ట్ర కనీస వేతనాల ఛైర్మెన్ పెళ్లకూరు శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, మాజీ జిల్లా పరిషత్ ఛైర్మెన్ చెంచలబాబు యాదవ్, నాయకులు మామిడాల మధు, జెన్ని రమణయ్య, పనబాక భూలక్ష్మి, దోర్నాల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# నెల్లూరులోనూ 'రెయిన్‌బో' సేవలు!

## మన నెల్లూరీయుడు డాక్టర్ రమేష్ కంచర్ల కృషితో.. శిశు సంరక్షణకి అధునాతన వైద్యం






*ప్రముఖ వైద్యులు, మన నెల్లూరీయుడు..రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్ వ్యవస్థాపక ఛైర్మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ కంచర్ల ఎట్టకేలకు తన కలను సాకారం చేసుకున్నారు. రెయిన్‌బో ఆసుపత్రి శిశు సంరక్షణ సేవలను నెల్లూరీయులకూ అందుబాటులోకి తెచ్చారు. జాతీయస్థాయిలో వైద్యరంగంలో విశేషఖ్యాతిని తెచ్చుకున్న ఆయన, తన జన్మభూమి అయిన నెల్లూరులోనూ రెయిన్‌బో ఆసుపత్రి సేవలను విస్తరించాలనే ఆకాంక్షతో గత కొద్దికాలంగా చేసిన కృషి ఫలించినట్లే!..*

శిశువుల వైద్య సంరక్షణ సేవలలో దేశంలో పేరుగాంచిన అగ్రగామి వైద్య సంస్థ 'రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్' తాజాగా తన సేవలను నెల్లూరుకి విస్తరించింది. దీంతో, నెల్లూరు ప్రజలకే కాక, చుట్టుపక్కల ఉన్న ప్రాంతాల ప్రజలకీ అత్యంత అధునాతన శిశు సంరక్షణ వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్లే. నెల్లూరులోని ప్రైమ్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో మెజారిటీ వాటాను పొందడం ద్వారా రెయిన్‌బో సేవలు నెల్లూరుకి కూడా విస్తరించాయి. దీంతో, దేశంలోనే ప్రఖ్యాతమైన ఆసుపత్రిగా పేరుగాంచిన రెయిన్‌బో ఆసుపత్రి సేవలు డాక్టర్ రమేష్ కంచర్ల కృషి ద్వారా జిల్లా ప్రజలందరికీ చేరువ కావడం విశేషం. దీంతో ప్రైమ్ చిల్డ్రన్ హాస్పిటల్‌లో మెజార్టీ వాటాల ద్వారా రెయిన్‌బో వారు ఆంధ్రంలో తమ నాల్గవ చిల్డ్రన్స్ హాస్పిటల్‌ని ప్రారంభించినట్లయింది.

### శిశు వైద్యసేవలకు.. 'రెయిన్‌బో' పెట్టింది పేరు :

రెయిన్‌బో ఆసుపత్రి అంటేనే అత్యంత అధునాతనమైన వైద్య సేవలను అందించే ఆసుపత్రిగా పెట్టిందిపేరు. శిశు సంరక్షణలో సుమారు పాతికేళ్ళ అనుభవం ఉన్న రెయిన్‌బో ఆసుపపత్రి ఇప్పుడు నెల్లూరులో నవజాత శిశువుల, మరియు పిల్లల ఇంటెన్సివ్ కేర్, పీడియాట్రిక్ సూపర్ స్పెషాలిటీ క్లినికల్ సేవలు, పీడియాట్రిక్ సర్జరీలను ఎల్లవేళలా అత్యవసర సంరక్షణతో రవాణా సేవలను అందిస్తోంది. పీడియాట్రిక్ కార్డియాలజీ, కార్డియాక్ సర్జరీ, పీడియాట్రిక్ న్యూరాలజీ, పీడియాట్రిక్ నెఫ్రాలజీ, రీనల్ ట్రాన్స్‌ప్లాంట్, బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంట్, లివర్ ట్రాన్స్‌ప్లాంట్, పీడియాట్రిక్ ఆంకాలజీ, పీడియాట్రిక్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, హెపటాలజీతో పాటు అధునాతనమైన నియోనాటల్ మరియు పీడియాట్రిక్స్ ఇంటెన్సివ్ కేర్ వంటి అనేక రకాల పీడియాట్రిక్ సూపర్‌స్పెషాలిటీలను కలిగి ఉన్న ఆసుపత్రి ఇది. హైదరాబాద్ ప్రధాన కేంద్రంగా ఉన్న రెయిన్‌బో ఆసుపత్రి బెంగళూరు, చెన్నై, ఢిల్లీ ఎన్‌సిఆర్ మరియు గౌహతి నగరాలకి విస్తరించి, దేశవ్యాప్తంగా 24రెయిన్‌బో ఆసుపత్రులను నిర్వహిస్తోంది. అలాంటి ప్రతిష్టాత్మకమైన, అధునాతనమైన ఆసుపత్రి నెల్లూరు ప్రజలకు అందుబాటులోకి రావడం హర్షదాయకం. ఈనెల 16న ఆమేరకు రెయిన్‌బో శిశువైద్య సేవలను ఆసుపత్రి ఛైర్మెన్ మరియు ఎం.డీ డాక్టర్ రమేష్ కంచర్ల ప్రారంభించారు. రెయిన్‌బో హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ ప్రీతమ్‌కుమార్‌రెడ్డి, ప్రైమ్ హాస్పిటల్ డాక్టర్ ఏ.కళ్యాణచక్రవర్తి, మీడియా వ్యవహారాల ఇన్‌చార్జి మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

### ఉన్నతస్థాయి సేవలందించడమే 'రెయిన్‌బో' లక్ష్యం

**- డాక్టర్ రమేష్ కంచర్ల**

'నెల్లూరు నా జన్మస్థలం. నా జిల్లాలోని ప్రజలకు రెయిన్‌బో ద్వారా అధునాతన శిశు ఆరోగ్య సంరక్షణ సేవలను అందించాలన్నదే నా ఆశయం' అని రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్ వ్యవస్థాపక ఛైర్మెన్ మరియు మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ కంచర్ల చెప్పారు. ఈ వైద్యసేవల కోసం నెల్లూరు ప్రజలు ఇకనుంచీ.. ఎంతో దూరం వ్యయప్రయాసలను భరించి ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, ఇక్కడే అన్ని రకాల అధునాతన వైద్యవసతులు లభించేలా చూస్తున్నామని తెలిపారు. జాతీయ నెట్‌వర్క్‌లో అందిస్తున్న విస్తృతమైన వైద్య నిపుణతల ఉన్నతస్థాయిని ఇక్కడి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే తన లక్ష్యం అని కూడా ఆయన స్పష్టం చేశారు.

## సనాతన ధర్మ రక్షణ..

# ప్రాచీన ఆలయాల పరిరక్షణే లక్ష్యం

## దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి



అలఘునాథస్వామి ఆలయంలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

రాష్ట్రంలో సనాతన ధర్మ పరిరక్షణ, ఆధ్యాత్మిక సంప్రదాయాల పరిరక్షణతో పాటు చారిత్రక ఆలయాల పునరుద్ధరణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆత్మకూరులోని శ్రీ అలగనాథ స్వామివారి ఆలయంలో రూ.80 లక్షల దేవాదాయ శాఖ నిధులతో నూతనంగా నిర్మించిన కళ్యాణ మండపాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం సుమారు 6,800 ఆలయాలకు ధూపదీప నైవేద్య పథకాన్ని అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఇందులో ఆత్మకూరు నియోజకవర్గంలోని 135 దేవాలయాలకు ధూపదీప నైవేద్య పథకం కింద సుమారు రూ.1.62కోట్లను ఖర్చు చేస్తున్నామని వెల్లడించారు. శ్రీ అలగనాథ స్వామివారి ఆలయాన్ని కూడా ఈ పథకంలో చేర్చామని తెలిపారు. ముఖ్యమంత్రి సూచనల మేరకు రాష్ట్రవ్యాప్తంగా 5,000 భజన మందిరాలను నిర్మించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని, ఇందుకోసం టీటీడీ నిధులను వినియోగించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సోమశిల సోమేశ్వరాలయం నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, జిల్లాలోని సంగమేశ్వరాలయాన్ని పూర్వ వైభవానికి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఉదయగిరి ప్రాంతంలోని శ్రీ రంగనాథస్వామి ఆలయానికి కూడా త్వరలోనే కేంద్ర పురావస్తు శాఖ అధికారులను తీసుకొచ్చి అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దేవాలయ పరిసరాలను కూడా సమగ్రంగా అభివృద్ధి చేసి భక్తులకు అవసరమైనమౌలిక వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు. కంచి కామకోటి పీఠం ఆధ్వర్యంలో ఆత్మకూరు పరిధిలో ఆశ్రమ పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం నియోజకవర్గంలో అనువైన ప్రాంతంలో ఐదు ఎకరాల భూమిని సేకరించి మఠం నిర్మాణానికి ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## వింజమూరు వై.ఆర్ జూనియర్ కళాశాల..

# స్వర్ణోత్సవ సంబరాలు 25న







నెల్లూరుజిల్లా వింజమూరులోని వైఆర్ జూనియర్ కళాశాల స్వర్ణోత్సవ సంబరాలు ఈనెల 25వ తేదీన వేడుకగా జరుగనున్నాయి. భారత 13వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు, నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొననున్నారు. ఈ సందర్భంగా ఆరోజు ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 6 గంటల వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు కళాశాల కరస్పాండెంట్ రాజా పవన్‌కుమార్, స్వర్ణోత్సవ సంబరాల కమిటీ అధ్యక్షులు కనకమేడల వెంకటరమణ తెలియజేశారు. ఈ కళాశాలలో చదువుకుని దేశవిదేశాల్లో వివిధ రంగాల్లో రాణిస్తున్న విద్యార్థులందరికీ కూడా ఈ సందర్భంగా ఆహ్వానం పలుకుతున్నామని వారు తెలిపారు.



# విద్యార్థి భవిష్యత్‌కు డిజిటల్ వేదిక : 'లింక్డ్ఇన్'ని ఉపయోగించుకునే మార్గాలు

ఇప్పటి డిజిటల్ యుగంలో విద్యార్థి భవిష్యత్‌ను నిర్ణయించే అంశాలు కేవలం మార్కులు, సర్టిఫికెట్లు మాత్రమే కాదు; ఆ విద్యార్థి నైపుణ్యాలు, అనుభవం, మరియు ప్రపంచానికి తనను ఎలా పరిచయం చేస్తున్నాడన్నది కూడా అంతే ముఖ్యమైనది. ఈ పరిచయాన్ని అత్యంత ప్రభావవంతంగా చేయగల వేదిక లింక్డ్ఇన్ (LinkedIn). ఇది సాధారణ సోషల్ మీడియా కాదు; ఇది విద్యార్థి భవిష్యత్‌కు డిజిటల్ పాస్‌పోర్ట్, అవకాశాల తలుపులు తెరిచే వేదిక, మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రొఫెషనల్స్‌తో కలిసే వంతెన. "పరిచయం అవకాశాన్ని తెస్తుంది, నైపుణ్యం విజయాన్ని ఇస్తుంది" అనే సూక్తి లింక్డ్ఇన్ యొక్క అసలు భావనను ప్రతిబింబిస్తుంది. విద్యార్థి లింక్డ్ఇన్‌ను సరిగ్గా ఉపయోగిస్తే, అతని ప్రొఫైల్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న కంపెనీలు, పరిశోధనా సంస్థలు, స్టార్టప్‌లు, మరియు విశ్వవిద్యాలయాల దృష్టిలో పడుతుంది. లింక్డ్ఇన్ అనేది ఒక డిజిటల్ రిజ్యూమ్ మాత్రమే కాదు; అది విద్యార్థి వ్యక్తిత్వం, నైపుణ్యాలు,అనుభవం, మరియు అభిరుచులను చూపించే వేదిక. ఈ వ్యాసం విద్యార్థి లింక్డ్ఇన్‌ను ఎలా ఉపయోగించాలి, ఎలా ప్రొఫైల్‌ను నిర్మించాలి, ఎలా నెట్‌వర్క్‌ను పెంచుకోవాలి, మరియు ఎలా అవకాశాలను పొందాలి అనే విషయాలను వివరిస్తుంది.

లింక్డ్ఇన్ ప్రొఫైల్ అనేది విద్యార్థి డిజిటల్ ప్రపంచంలో తనను పరిచయం చేసే మొదటి అడుగు. ఒక మంచి ప్రొఫైల్ "మాటలకంటే ఎక్కువ చెప్పే ముఖచిత్రం" లాంటిది. విద్యార్థి ప్రొఫైల్‌లో ఉన్న ప్రతి అంశం అతని భవిష్యత్‌ను ప్రభావితం చేస్తుంది. ప్రొఫైల్ ఫోటో, హెడ్‌లైన్, About సెక్షన్, Education, Skills, Projects, Certifications–ఇవి అన్నీ కలిసి ఒక బలమైన డిజిటల్ వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి. ప్రొఫైల్ ఫోటో ప్రొఫెషనల్‌గా ఉండాలి. ఇది చిన్న విషయం అనిపించినా, కంపెనీలు మొదట చూసేది ఇదే. హెడ్‌లైన్‌లో విద్యార్థి తన ఆసక్తి రంగాన్ని స్పష్టంగా చెప్పాలి. ఉదాహరణకు : About సెక్షన్‌లో విద్యార్థి తన ప్రయాణం, ఆసక్తులు, నైపుణ్యాలు, మరియు భవిష్యత్ లక్ష్యాలను స్పష్టంగా చెప్పాలి. Projects సెక్షన్ విద్యార్థి ప్రొఫైల్‌లో అత్యంత ముఖ్యమైన భాగం. చిన్న ప్రాజెక్టులు కూడా ఇక్కడ చేర్చాలి. ఉదాహరణకు, ఒక విద్యార్థి Pythonలో ఒక చిన్న Data Analysis ప్రాజెక్టు చేసినా, అది అతని నైపుణ్యాన్ని చూపిస్తుంది. Certifications సెక్షన్‌లో Coursera, edX, Udemy, LinkedIn Learning వంటి వేదికలలో చేసిన కోర్సులను చేర్చాలి. ఇవి విద్యార్థి నిరంతర అభ్యాసాన్ని చూపిస్తాయి.

లింక్డ్ఇన్ యొక్క అసలు శక్తి నెట్‌వర్కింగ్. ఇది విద్యార్థి ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రొఫెషనల్స్‌తో కలిసే మార్గం. "సంబంధాలే సంపద" అనే సూక్తి లింక్డ్ఇన్‌కు అచ్చం సరిపోతుంది. విద్యార్థి తన ఆసక్తి రంగంలో ఉన్న వ్యక్తులను ఫాలో అవ్వాలి, వారి పోస్టులను చదవాలి, అవసరమైతే కామెంట్ చేయాలి, మరియు నెమ్మదిగా నెట్‌వర్క్‌ను నిర్మించాలి.

జ్ఞాన నేత్రం
డా. నరసింహారెడ్డి ఊరిమిండి
Dallas, Texas, USA

Connections పెంచుకోవడం ముఖ్యం. కానీ Connections అనేవి సంఖ్య కాదు; అవి నాణ్యత. విద్యార్థి తన రంగంలో ఉన్న ప్రొఫెషనల్స్, ప్రొఫెసర్లు, కంపెనీ రిక్రూటర్లు మరియు స్టార్టప్ ఫౌండర్లతో కనెక్ట్ అవ్వాలి. ఒక మంచి కనెక్షన్ భవిష్యత్‌లో ఇంటర్న్‌షిప్, రీసెర్చ్ అవకాశం, లేదా ఉద్యోగం కూడా తెచ్చి పెట్టగలదు. లింక్డ్ఇన్‌లో Groups కూడా చాలా ఉపయోగపడతాయి. ఉదాహరణకు, Data Science Groups, AI Research Groups, Student Career Development Groups వంటి గ్రూపుల్లో చేరడం ద్వారా విద్యార్థి కొత్త అవకాశాలను తెలుసుకోగలడు. Discussionsలో పాల్గొనడం ద్వారా అతని పేరు నెమ్మదిగా కనిపించసాగుతుంది. లింక్డ్ఇన్‌లో Jobs సెక్షన్ విద్యార్థికి ఇంటర్న్‌షిప్‌లు, పార్ట్‌టైమ్ అవకాశాలు, రిమోట్ ఇంటర్న్‌షిప్‌లు, మరియు రీసెర్చ్ అవకాశాలను చూపిస్తుంది. "Open to Internship" అనే ఆప్షన్‌ను ఆన్ చేస్తే, కంపెనీలు అతని ప్రొఫైల్‌ను నేరుగా చూడగలవు. Search బార్‌లో Internship, Summer Internship, Research Intern, Student Opportunities వంటి పదాలతో వెతికితే అనేక అవకాశాలు కనిపిస్తాయి. భారత దేశంలో ఉన్న కంపెనీలు కూడా లింక్డ్ఇన్‌లో ఇంటర్న్‌షిప్‌లు పోస్టింగ్ చేస్తాయి. అమెరికా, యూరప్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో ఉన్న కంపెనీలు కూడా లింక్డ్ఇన్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తాయి. LinkedIn Learning కూడా విద్యార్థికి అత్యంత ఉపయోగకరం. ఇందులో Communication Skills, Leadership Skills, Data Analytics, AI, Cloud Computing వంటి కోర్సులు ఉన్నాయి. ఇవి విద్యార్థి ప్రొఫైల్‌లో నేరుగా కనిపిస్తాయి. ఒక విద్యార్థి LinkedIn Learningలో 10–15 కోర్సులు పూర్తి చేస్తే, అతని ప్రొఫైల్ బలంగా మారుతుంది.

లింక్డ్ఇన్‌ను సరిగ్గా ఉపయోగించడానికి విద్యార్థి క్రమశిక్షణతో ముందుకు సాగాలి. ప్రతి వారం ఒకసారి ప్రొఫైల్‌ను నవీకరించాలి. ప్రతి వారం ఒక కొత్త నైపుణ్యాన్ని నేర్చుకోవాలి. ప్రతి వారం ఒక మంచి పోస్టును రాయాలి. ప్రతి వారం 5–10 కొత్త Connections చేయాలి. ఈ చిన్న చిన్న చర్యలు కలిసి పెద్ద మార్పును తీసుకువస్తాయి. పోస్టులు రాయడం చాలా ముఖ్యం. ఉదాహరణకు, "నేను Pythonలో కొత్తగా నేర్చుకున్న విషయం", "నేను చేసిన చిన్న ప్రాజెక్టు", "నేను చదివిన మంచి ఆర్టికల్", "నేను పాల్గొన్న వర్క్‌షాప్"–ఇవి అన్నీ పోస్టులుగా రాయవచ్చు. పోస్టులు రాయడం ద్వారా విద్యార్థిపేరు నెమ్మదిగా కనిపించసాగుతుంది. లింక్డ్ఇన్ అనేది విద్యార్థి జీవితంలో ఒక సాధనం మాత్రమే కాదు; అది భవిష్యత్‌ను నిర్మించే శక్తివంతమైన వేదిక. సరైన ప్రొఫైల్, బలమైన నెట్‌వర్క్, నిరంతర అభ్యాసం, మరియు క్రమశిక్షణతో లింక్డ్ఇన్‌ను ఉపయోగిస్తే..విద్యార్థితన జీవితాన్ని పూర్తిగా మార్చుకోగలడు. లింక్డ్ఇన్‌ను సరిగ్గా ఉపయోగించే విద్యార్థి ప్రపంచానికి కనిపిస్తాడు, అవకాశాలు అతని వద్దకు వస్తాయి, మరియు అతని భవిష్యత్ డిజిటల్ ప్రపంచంలో బలంగా నిలుస్తుంది.



**వచ్చే వారం :** అనుభవం లేకపోయినా వ్యక్తిగత పోర్ట్‌ఫోలియో : విద్యార్థి ప్రతిభను ప్రపంచానికి చూపించే మార్గం

E-mail: reddyu@gmail.com

## శివపంచాయతన క్షేత్రంలో.. బ్రహ్మశ్రీ సామవేదం



సత్కారాన్నందుకుంటున్న సామవేదం షణ్ముఖశర్మ

ప్రవచన చక్రవర్తి, బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ ఇటీవల హరిహరతత్వం గురించి తమ ప్రవచనాలను భక్తులకు వినిపించేందుకు నెల్లూరుకు వచ్చిన సందర్భంగా నెల్లూరు రూరల్ మండలంలోని నరసింహకొండ వద్ద ఉన్న శ్రీ మానస సరోవర శివపంచాయతన క్షేత్రాన్ని, ఆది శంకర అనుష్టాన పీఠాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ పాలక మండలి వారు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన అక్కడకు వచ్చిన భక్తులనుద్దేశించి, ఆ క్షేత్రం అభివృద్ధిని గురించి వివరించారు. ఎంతో విశిష్టతగల ఈ ఆలయం భవిష్యత్తులో మరింతగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఆలయ అధ్యక్షులు గోపినాధమ్ మల్లిఖార్జునశర్మ, కోశాధికారి శ్రీహరి ప్రసాదశర్మ, రుద్రప్రముఖ్ టి.కృష్ణశర్మ, వాసుదేవన్‌శర్మ, సభ్యులు మరియు రుత్విక్కులు పి.శివకుమార్‌శర్మ, జి.శివ ప్రసాద్‌శర్మ, ఏ.ఫణికుమార్‌శర్మ, నాగేశ్వరశర్మ తదితరులు పాల్గొన్నారు.

## జొన్నవాడలో కాత్యాయని వ్రతం



బుచ్చిరెడ్డిపాళెం మండలం లోని జొన్నవాడలో ఉన్న శ్రీ మల్లికార్జునస్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం కాత్యాయని వ్రతాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా వ్రత కార్యక్రమాలను నిర్వహించి, కాత్యాయని అమ్మవారికి విశేష పూజలు చేసి, ప్రత్యేక నైవేద్యాలను సమర్పించారు. దేవస్థానం ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, ధర్మకర్తలమండలి సభ్యులు, ఆలయ సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

### స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు..

జొన్నవాడ దేవస్థానంలో ఆగస్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు జరిగాయి. దేవస్థానం ఛైర్మెన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, దేవస్థాన సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణ అధికారి అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి, దేవస్థాన ధర్మకర్త మండలి సభ్యులు పాల్గొని వేడుకలు నిర్వహించారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ స్వయంసేవకులు మరియు నెల్లూరులోని గురుకృప కళాక్షేత్రం నిర్వాహకులు పాల్గొని జాతీయ పతాకానికి గౌరవ వందనం సమర్పించారు.

## సర్వేపల్లిలో.. తిరంగా ర్యాలీ

ముత్తుకూరులోని ఈదూరు ఈశ్వరమ్మ జెడ్పీ హైస్కూలులో ఆగస్టు 15న జరిగిన స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల్లో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పాల్గొని జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. శ్రీ చైతన్య స్కూలులో జరిగిన వేడుకల్లోనూ ఆయన పాల్గొన్నారు. జెడ్పీ హైస్కూలు విద్యార్థులతో కలిసి తిరంగా ర్యాలీ నిర్వహించారు. స్వాతంత్ర్యపోరాటంలో నెల్లూరుజిల్లాకు చెందిన పొట్టి శ్రీరాములు, పొణకా కనకమ్మ, బెజవాడ గోపాల్‌రెడ్డి, ఆనం చెంచుసుబ్బారెడ్డి, వెన్నెలకంటి రాఘవయ్య, సోమిరెడ్డి ఆదినారాయణరెడ్డి, ముత్తుకూరు వాసి ఈదూరు సుందరరామిరెడ్డి వంటి ఎందరో మహనీయులు ఉద్యమంలో కీలకపాత్ర పోషించారని ఆయన విద్యార్థులకు తెలిపారు.

## ఇరుకళలమ్మవారికి.. శ్రావణమాస పూజలు

శ్రావణమాసం సందర్భంగా ఈనెల 15న నెల్లూరు చెరువుగట్టున వెలసివున్న సింహపురి గ్రామదేవత శ్రీ ఇరుకళల పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో పత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని పుష్పమాలికలతో శోభాయమానంగా అలంకరించి శ్రావణమాస ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. చందనాలంకారంలో కొలువైన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలి వచ్చారు. అనంతరం పూలంగిసేవ, పల్లకి సేవలు నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఛైర్మెన్ ఒట్టూరు సురేంద్రయాదవ్, ఇఓ గిరికృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

## ముగ్గురు ఎస్ఐలకి..బొలెరో వాహనాలు

- పంపిణీచేసిన ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి



పోలీసులకి బొలెరో వాహనాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

శాంతిభద్రతల పరిరక్షణలోనూ, ప్రజలకు రక్షణగా నిలవడంలోనూ పోలీసులు అందిస్తున్న సేవలు ఎంతో అభినందనీయమని కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చెప్పారు. ఇటీవల కొడవలూరులో వీపీఆర్ ఫౌండేషన్ తరఫున నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కోవూరు నియోజకవర్గంలోని కొడవలూరు, విడవలూరు, ఇందుకూరుపేట సబ్ ఇన్‌స్పెక్టర్‌లకు ఎమ్మెల్యే రూ.30 లక్షల విలువైన మూడు బొలెరో వాహనాలను పంపిణీ చేశారు. జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల, డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, కొడవలూరు ఎస్సై కోటిరెడ్డి, విడవలూరు ఎస్ఐ సాయి కళ్యాణ్, ఇందుకూరుపేట ఎస్సై నవీన్ కుమార్, ప్రశాంతిరెడ్డి తనయుడు డాక్టర్ అర్జున్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లావ్యాప్తంగా పోలీసుల తనిఖీలు

➢ 24 కేసులు-లక్షా 26వేల జరిమానాలు

నేరనియంత్రణలో భాగంగా జిల్లావ్యాప్తంగా ఇటీవల పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నారు. అనుమానాస్పద వ్యక్తులు, పాత నేరస్తుల కదలికలపై నిఘా పెట్టారు. వాహనాలను, లాడ్జీలను ప్రత్యేక బృందాలతో తనిఖీ చేస్తున్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు జాతీయ రహదారుల్లో మోహరించి వాహనాలు పరిశీలిస్తున్నారు. ప్రధాన కూడలి ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లు వగైరాలన్నిటిపై ప్రత్యేక దృష్టిసారించి ఎక్కడా నేరాలకు, అసాంఘిక కార్యక్రమాలకు తావులేకుండా చూస్తున్నారు. జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదేశాలతో ఈనెల 16న నాకాబందీ నిర్వహించి, రహదారుల్లో వాహనదారులను తనిఖీచేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి, 20 మందిపై కేసులు నమోదు చేశారు. సరైన పత్రాలు లేకపోవడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం తదితర కారణాలతో 242 కేసులు నమోదు చేసి, వారికి మొత్తంగా లక్షా 26 వేల 660 రూపాయల జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమించి ఇష్టానుసారం మితిమీరిన వేగంతో వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మెగా డీఎస్సీని అడ్డుకునే కుట్ర

## వైకాపాపై అసెంబ్లీలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి విమర్శలు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సంతకంతోనే మెగా డీఎస్సీకి శ్రీకారం చుట్టారని, కేవలం 148 రోజుల్లోనే 16,347 ఉపాధ్యాయ పోస్టులను అత్యంత పారదర్శకంగా భర్తీ చేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని, అయితే వైకాపా వారు మాత్రం మెగా డీఎస్సీపై లేనిపోని కుట్రలు చేస్తున్నారని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విమర్శించారు. ఇటీవల అసెంబ్లీ సమావేశాల్లో ఆమె మాట్లాడుతూ, అసెంబ్లీకి వచ్చి విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో చర్చించే ధైర్యం వైకాపాకు ఉందా? అని ప్రశ్నించారు. ఉద్యోగాల భర్తీని అడ్డుకునేందుకు ప్రతిపక్షాలు చేస్తున్న నిరసనలు రాజకీయ లబ్ధి కోసం చేస్తున్నవేనని, వాస్తవానికి అవి నిరుద్యోగ యువతకు వ్యతిరేకంగా చేస్తున్న పోరాటాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో నోటిఫికేషన్ల కోసం యువత ఎదురుచూసే పరిస్థితి ఉండేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే నోటిఫికేషన్ ఇచ్చి, ప్రక్రియను పూర్తిచేసి ఉద్యోగాలు భర్తీ చేసిందన్నారు. 2011 నుంచి ఎన్‌సీఈఆర్టీ నిబంధనల ప్రకారం, టెట్‌లో అర్హత సాధించిన వారు మాత్రమే డీఎస్సీ రాసేందుకు అర్హులని తెలిపారు. నేటి ఉపాధ్యాయులు టెట్‌తో పాటు డీఎస్సీ పరీక్ష రాసి మెరిట్ ఆధారంగా ఎంపికైనవారన్నారు. 2023లో అప్పటి వైసీపీ ప్రభుత్వం జీవో నంబర్ 77ను 2023 ఆగస్టు 2న జారీ చేసిందన్నారు. దీంతో స్పోర్ట్స్ కోటాలో గతంలో ఉన్న వర్టికల్ రిజర్వేషన్‌కు బదులుగా హారిజాంటల్ రిజర్వేషన్ విధానం అమల్లోకి వచ్చిందని వివరించారు. అదే విధానాన్ని ప్రస్తుత డీఎస్సీలో కూడా అమలు చేశారని, గత పాలకులు తీసుకొచ్చిన జీవో ప్రకారమే నియామకాలు జరిగాయని స్పష్టం చేశారు. వాస్తవాలు తెలియకుండా నిందలు వేయడం అర్హులైన అభ్యర్థులను అవమానించడమేనన్నారు. యువతకు ఉద్యోగాలు రాకుండా అడ్డుకునేందుకు ఏకంగా 335 పిటిషన్లు వేయించి, కోర్టుల ద్వారా మెగా డీఎస్సీని అడ్డుకునేందుకు ప్రయత్నాలు చేశారని ఆమె ఆరోపించారు.

# గంజాయిపై ఉక్కుపాదం!

## కట్టుదిట్టమైన చర్యలకి సిద్ధమవుతున్న జిల్లా అధికారయంత్రాంగం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, పక్కన జిల్లా ఎస్పీ అజితా వేజండ్ల

జిల్లాలో గంజాయి, తదితర మాదక ద్రవ్యాలపై జిల్లా కలెక్టర్, ఎస్పీ తదితర అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. ముఖ్యంగా యువత, విద్యార్థుల జీవితాలను నాశనం చేస్తున్న ఈ మత్తు పదార్థాల నిరోధం పట్ల అధికారయంత్రాంగం ప్రత్యేకంగా మరింత కట్టుదిట్టమైన చర్యలు తీసుకునేందుకు నిర్ణయించారు. ఈనెల 18న కలెక్టరేట్‌లో జరిగిన ఎన్‌సీఓఆర్‌డి సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఎస్పీ అజిత వేజెండ్ల మాదకద్రవ్యాల నిర్మూలనకు తీసుకుంటున్న చర్యలపై చర్చించారు. గంజాయి అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసకుంటున్నామని, 2025-2026లో ఇప్పటివరకు 50 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదు చేసి 162మందిని అరెస్టు చేశామని, 879.5కిలోల డ్రై గంజాయి స్వాధీనం చేసుకోవడంతో పాటు 21 వాహనాలు సీజ్ చేశామని ఎస్పీ డా. అజిత వేజెండ్ల కలెక్టర్‌కి తెలిపారు. 2026లో ఆగస్టు 17వ తేదీ వరకు 9 ఎన్‌డీపీఎస్ కేసులు నమోదుచేసి 33మందిని అరెస్టు చేశామన్నారు. ఈ కేసుల్లో 333.407 కిలోల డ్రై గంజాయిని స్వాధీనం చేసుకుని 5 వాహనాలను సీజ్ చేసినట్లు వివరించారు. మాదకద్రవ్యాల నియంత్రణపై సమగ్ర కార్యాచరణకు ఉపక్రమించాలని, మాదక ద్రవ్యాల నెట్‌వర్క్‌ను విచ్ఛిన్నం చేసే చర్యలపై వారు చర్చించారు. అలాగే పాఠశాలలు, కళాశాలల్లో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, తనిఖీలు ముమ్మరం చేయడం, హెల్ప్‌లైన్ సేవలపై ప్రచారం కల్పించడం ద్వారా మాదకద్రవ్యాల నిర్మూలనకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఏఎస్పీలు దీక్ష, సౌజన్య, డిఆర్వో విజయ్‌కుమార్, డిఎం అండ్‌హెచ్‌ఓ డా. సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో స్వాతంత్ర్య వేడుకలు



జెండా వందనం చేస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసులు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో ఆగస్టు 15వ తేదీన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం.శ్రీనివాసులు జాతీయ పతాకాన్ని ఎగురవేసి జెండా వందనం సమర్పించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పలువురు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ క్యాడెట్లు మార్చ్‌పాస్ట్ నిర్వహించారు. అనంతరం విద్యార్థులు దేశభక్తిని చాటే సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. క్యాప్టెన్ డాక్టర్ జి.మాధవయ్య, సబ్ లెఫ్టినెంట్ తులగా జనార్ధన్, డాక్టర్ రవీంద్రారెడ్డి, పలు విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## మహానుభావుల త్యాగఫలితమే.. స్వాతంత్ర్యం

### - ఎమ్మెల్యే డాక్టర్ పాశిం



జెండా వందనం చేస్తున్న ఎమ్మెల్యే సునీల్, ఆర్డీఓ అరుణకుమారి

ఎందరో మహానుభావుల ప్రాణత్యాగ ఫలితంగా దేశానికి స్వాతంత్రం వచ్చిందని, అటువంటి మహానీయులను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ వెల్లడించారు. పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో జరిగిన 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలకి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీల్‌కుమార్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతోందని, గత రెండేళ్లలో గూడూరు నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పంబలేరు బ్రిడ్జి పనులు త్వరలోనే ప్రారంభిస్తున్నామని, ఫ్లైఓవర్ బ్రిడ్జి గురించి కేంద్రప్రభుత్వానికి లేఖ పంపించడం జరిగిందని తెలిపారు. ఆర్డీవో అరుణకుమారి, మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్, నాయకులు కిరణ్‌కుమార్, బిల్లు చెంచురామయ్య, రహీం, సోమిశెట్టి చెంచురామయ్య, ప్రసన్నలక్ష్మి, లీలావతి తదితరులు పాల్గొన్నారు.

అదేవిధంగా గూడూరు పట్టణంలోని పురపాలక, సబ్‌కలెక్టర్, తహాశీల్దార్, ఎంపిడిఓ, డీఎస్పీ, సర్కిల్ పోలీస్‌స్టేషన్, ఇరిగేషన్, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.



నెల్లూరులో ఈ నెల 15న జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పేదలకు అందించిన ఉత్తమ సేవలకుగాను మంత్రి నారాయణ, జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న ఏపిజె అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు సయ్యద్ తాజుద్దీన్

# వైభవంగా కుంభాభిషేక ఉత్సవాలు



ఎమ్మెల్యే సునీల్‌ని సత్కరిస్తున్న ఆలయ ఛైర్మెన్ శివకుమార్, ఈవో రవికృష్ణ

గూడూరు పట్టణంలోని శ్రీకృష్ణ ధర్మరాజుస్వామి దేవస్థానంలో వైభవంగా సాగుతున్న శిఖర ప్రతిష్ట కుంభాభిషేక ఉత్సవాలలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మెన్ వాటంబేడు శివకుమార్, ఈవో రవికృష్ణ ఎమ్మెల్యేని సన్మానించి ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన నూతన కార్యాలయ గదిని ప్రారంభించారు. బిల్లు చెంచురామయ్య, వాటంబేడు హరికుమార్, అబ్దుల్ రహీం, శ్రీకంటి రామమోహన్‌రావు, చంద్రనిల్ పాల్గొన్నారు.

# శ్రీకంటి సేవలకి ప్రశంసా పత్రం





ఈ నెల 15న గూడూరులో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలలో ఎస్.వి. రత్నం చారిటీస్ ద్వారా ఉత్తమ సేవలను అందించినందుకుగాను గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, ఆర్డీఓ అరుణకుమారిల ద్వారా ట్రస్ట్ ఛైర్మెన్ మరియు గూడూరు శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానం పాలకమండలి ఛైర్మెన్ శ్రీకంటి రామమోహన్‌రావు ప్రశంసాపత్రాన్ని అందుకున్నారు.



ఈ నెల 18వ తేదీ తూర్పు కనుపూరు గ్రామంలోని శ్రీ ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ మాజీ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేనమ్మ.



నేత్ర వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

# మెగా కంటి వైద్య శిబిరం

గూడూరు పట్టణంలోని న్యూ బాలాజీనగర్ ఆవరణలో వెరిటాస్ జూనియర్ కాలేజీ ఆవరణలో సోమవారం కోట మండలం చెందోడు గ్రామానికి చెందిన విద్యాప్రదాత స్వర్గీయ ముప్పవరపు వెంకటేశ్వరరావు, ఆదిలక్ష్మిల జ్ఞాపకార్థం ఎం.వి.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. వెరిటాస్ జూనియర్ కళాశాల ఛైర్మెన్, కరస్పాండెంట్‌లు నాదెండ్ల హరిబాబు, సుకుమార్‌నాయుడు ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కోట పట్టణానికి చెందిన రమేష్ ఐ కేర్ నేత్ర వైద్యుడు వి.రమేష్‌బాబు నేత్ర సమస్యలతో బాధపడేవారికి కంప్యూటర్ ద్వారా పరీక్షలు నిర్వహించారు. దృష్టిలోపం ఉన్న వారికి అతి తక్కువ ధరకు కంటి అద్దాలు, కంటిలో శుక్లాలు ఇతర సమస్యలతో బాధపడేవారికి తిరుపతిలోని వాసన్ ఐ కేర్‌లో శస్త్ర చికిత్సలు చేయించనున్నామని ఎం.వి.రావు ఫౌండేషన్ ఛైర్మెన్ ముప్పవరపు లీలామోహన్ కృష్ణ తెలిపారు. కార్యదర్శి ఎం.విజయలక్ష్మి, డాక్టర్ సుగుణమ్మ, ప్రిన్సిపల్ బాబురెడ్డి, మీరయ్యనాయుడు పాల్గొన్నారు.



గూడూరులో ఈ నెల 15న జరిగిన 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో తిరుపతి జిల్లా విజిలెన్స్ మరియు మానిటరింగ్ శాఖలో అందిస్తున్న ఉత్తమ సేవలకు గాను గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, ఆర్డీవో అరుణకుమారిల చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న అరవ పార్వతయ్య


# కళ్యాణ వైభవం...!

## సమంత్ - వినీత



నెల్లూరు వాస్తవ్యులు నలగట్ల శ్రీధర్‌రెడ్డి - శ్రీమతి లకుమల కుమారుడు **సమంత్‌రెడ్డి - వినితరెడ్డి**ల పరిణయం ఆగస్టు 16వ తేదీ ఒంగోలులో, రిసెప్షన్ ఆగస్టు 19వ తేదీ నెల్లూరులో వేడుకగా జరిగాయి. ఈ వేడుకలకి నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిలు హాజరై కొత్త జంటను ఆశీర్వదించారు. నవదంపతులకి 'లాయర్' శుభాశీస్సులు.

## యశ్వంత్ - శివాని



నెల్లూరు వాస్తవ్యులు నిడిముసలి మల్లికార్జునరెడ్డి - సురేఖల కుమారుడు **యశ్వంత్ - శివాని**ల వివాహం ఆగస్టు 16వ తేదీ నెల్లూరులో వైభవంగా జరిగింది. నూతన వధూవరులకు 'లాయర్' శుభదీవెనలు.







ఆగష్టు 15న 80వ స్వాతంత్ర్య దినోత్సం సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరించి, అనంతరం గౌరవ వందనం స్వీకరించి కార్య క్రమాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న చెన్నై విమానాశ్రయం డైరెక్టర్, మన నెల్లూరీయుడు యం.రాజకిషోర్. చెన్నై ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ బాధ్యత లతో పాటు ఎయిర్‌పోర్ట్ అధారిటీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత్ రీజియన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కూడా రాజకిషోర్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

# మాట నిలబెట్టుకున్నాం

ఎంపీ వేమిరెడ్డి



ఎంపీ వేమిరెడ్డి, ఎమ్మెల్యే నాగేశ్వరరావులను సత్కరిస్తున్న పెద్దపట్టపాళెం ప్రముఖులు

ఎన్నికలప్పుడు చెప్పిన మాటను నిలబెట్టుకుని ప్రజల ముందుకు వచ్చామని, కళ్ల ముందు కనిపిస్తున్న అభివృద్ధిని చూసి స్థానిక ఎన్నికల్లో తమను ఆదరించాలని నెల్లూరు పార్లమెంట్ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి కోరారు. ఇటీవల ఆయన కందుకూరు నియోజకవర్గం ఉలవపాడు మండలం పెద్దపట్టపాళెం గ్రామంలో రూ.20 లక్షల సొంత నిధులతో నిర్మించిన బకింగ్‌హామ్ కెనాల్ బ్రిడ్జిని, రూ.20.50 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ని, కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ, బ్రిడ్జి నిర్మాణాన్ని నామమాత్రంగా కాకుండా నాణ్యతతో పూర్తి చేశారని, దీంతో గ్రామ ప్రజలకు రాకపోకల విషయంలో, వర్షా కాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని తెలిపారు. పెద్దపట్టపాళెం గ్రామంలో విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను కూడా ప్రారంభించడం ఆనందంగా ఉందని, క్లినిక్‌లో 14 రకాల ల్యాబ్ పరీక్షలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. గతంలో చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా చుట్టుపక్కల ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, ఇకపై గ్రామంలోనే ప్రాథమిక వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు.

# గురుకుల పాఠశాలను కొనసాగించండి

- ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేసిన గూడూరు ఎమ్మెల్యే పాశం



సీఎం చంద్రబాబు, మంత్రి బాలవీరాంజనేయస్వామిలకి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్

కోట మండలంలోని గురుకుల పాఠశాలను యధావిధిగా కొనసాగించాలని కోరుతూ సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రి బాలవీరాంజనేయస్వామికి ఈనెల 18వతేదీ గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్‌కుమార్ అమరావతిలో వినతిపత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం నిరుపేద విద్యార్థుల ఐఐటి, నీట్ కోచింగ్‌ల కోసం ఎక్సలెన్స్ కళాశాల ఏర్పాటు చేసేందుకు కోటలోని గురుకుల పాఠశాలను ఎంపిక చేశారని, దీంతో అక్కడ చదివే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, వారి కోసం కోటలోనే కొనసాగించాలని విన్నవించారు.

# జెన్‌కో ఎం.డీతో..సోమిరెడ్డి భేటీ



జెన్‌కో ఎం.డీకి సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

విజయవాడలోని జెన్‌కో కార్యాలయంలో ఈనెల 20వ తేదీ గురువారం నాడు మాజీమంత్రి, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి జెన్‌కో మేనేజింగ్ డైరెక్టర్ నాగలక్ష్మిని కలసి, ముత్తుకూరు మండలం నేలటూరు ప్రజల సమస్యలని వివరించారు. ఆ సమస్యలను పరిష్కరించి వారికి న్యాయం చేయాలని కోరారు. భూనిర్వాసితులకు, స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, ఇప్పటికే పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలని సూచించారు. పునరావాస కాలనీల నిర్మాణాన్ని మరింత వేగవంతం చేసి, తీవ్ర కాలుష్యానికి గురవుతున్న నేలటూరు పంచాయతీని తరలించే చర్యలను వేగవంతం చేయాలని కోరారు. గ్రామం తరలింపు పూర్తయ్యే వరకు స్థానికంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ, ఆమేరకు ఆమెకి వినతిపత్రం సమర్పించారు.

# హామీలు విస్మరిస్తున్న సీఎం!

## నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విమర్శ



రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను విస్మరిస్తున్నారని వైసీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. ఇటీవల వెంకటగిరిలోని తమ నివాసంలో విలేకర్లతో మాట్లాడుతూ చేనేత కార్మికులను గత వైఎస్‌ఆర్సిపి అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కంటే ఎక్కువ ఇచ్చి ఆదుకుంటానని హామీ ఇచ్చి, అధికారం చేపట్టి న తర్వాత ఆ నిధులను ఇవ్వలేదన్నారు. ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్న భయంతో నేతన్న నేస్తం పథకానికి పేరు మార్చి నేతన్న సేవలో అని నామమాత్రంగా పథకాన్ని అమలు చేశారని విమర్శించారు. 2026లో అర్హులైన చేనేత కార్మికులను పక్కనపెట్టి చనిపోయిన వారిని, విదేశాల్లో ఉన్న వారి పేరుతో నిధులు డ్రా చేసుకొని టిడిపి నాయకులు కొత్త మోసానికి తెర లేపారని ఆరోపించారు. గతంలో లబ్ధిదారుల జాబితా సచివాలయంలో అందుబాటులో ఉండేదని ఇప్పుడు ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు. వెంకటగిరిలో వైఎస్‌ఆర్సిపి హయాంలో 2205 మంది చేనేత కార్మికులు అర్హులుగా ఉండి పథకం పొందారని, నేడు కూటమి ప్రభుత్వం వారిలో 669 మందికి కోత విధించి అనర్హులతో కలిపి కేవలం 1536 మందికి ఇచ్చారని దుయ్యబట్టారు. మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలో ఇచ్చిన మాట ప్రకారం కరోనా సమయంలో సైతం మాట తప్పకుండా ఐదేళ్లపాటు ప్రతి చేనేత కార్మికునికి 24000 రూపాయలు అందించారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ విషయాలన్నింటినీ ప్రజలకు తెలియజేస్తామని ఆయన అన్నారు. త్వరలో వెంకటగిరి మున్సిపాలిటీ పరిధిలో వార్డులలో పర్యటించి కనీస సౌకర్యాలు లేని ప్రాంతాలను అధికారులు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆయన నియోజకవర్గ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

## జూనియర్ డాక్టర్ల నిరసన

తమకు స్టయిఫండ్ పెంచాలని కోరుతూ ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ జూనియర్ డాక్టర్లు ఈనెల 17న నెల్లూరులోని సర్వజన ఆసుపత్రిలో నిరసన చేపట్టారు. అత్యవసర వైద్యసేవలను కూడా నిలిపేసి, నిరాహార దీక్ష చేశారు. జూనియర్ డాక్టర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు హనీష్‌కుమార్ మాట్లాడుతూ, జూనియర్ డాక్టర్లకు పనివత్తిడి తప్ప ఎలాంటి సదుపాయాలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. తమ సమస్యలు తీర్చకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు.

## శబరి శ్రీరామక్షేత్రం.. వార్షికోత్సవాలు 22 నుంచి

నెల్లూరు దర్గామిట్టలోని శబరి శ్రీరామ క్షేత్రం 26వ వార్షికోత్సవాలు ఈనెల 22 నుంచి 25వతేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. 22వ తేదీ సాయంత్రం వార్షికోత్సవాలకు అంకురార్పణ, 23న ఆలయ ప్రాంగణంలో విశేష హోమాలు, 24న స్నపన తిరుమంజనం, విశేష హోమాలు, 25వ తేదీ ఉదయం 5.30 గంటలకు రాములవారికి అభిషేకం జరుగుతాయని ఆలయ ఛైర్మెన్ చెన్నూరు వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు.

## డీవైఎఫ్‌ఐ మహాసభలు 1 నుంచి

డీవైఎఫ్‌ఐ మహాసభలు నెల్లూరులో సెప్టెంబరు 1 నుంచి మూడురోజులపాటు జరుగుతా యని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. ఆ మేరకు ఈనెల 16న నగరంలోని జెట్టి శేషారెడ్డి విజ్ఞానకేంద్రంలో మహాసభల లోగోను ఆయన ఆవిష్కరించారు. డీవైఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు నరసింహ, సీపీఎం నాయకులు మాదాల వెంకటేశ్వర్లు, గోపాల్, భాస్కర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## వాకర్స్ ఆధ్వర్యంలో.. రక్తదాన శిబిరం

నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఏసీ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 16న రక్తదాన శిబిరం నిర్వహించారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో, అసోసియేషన్ అధ్యక్షుడు స్నేహ సురేష్ నేతృత్వంలో పలువురు క్రీడాకారులు, యువకులు రక్తదానం చేశారు. వాకర్స్ గవర్నర్ నలుబోలు బలరామయ్య నాయుడు, వాకర్స్ ప్రతినిధులు ఎన్వి రమణారెడ్డి, పి.శ్రీనివాసులురెడ్డి, బి.సునీల్ రెడ్డి, ఎస్.రమేష్, శేఖర్ పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై దాడి

### -1.38 లక్షలు స్వాధీనం -

నెల్లూరు తెలుగుగంగ కార్యాలయం సమీపంలో ఉన్న పేకాట స్థావరంపై పోలీసులు ఈనెల 17న దాడి చేసి, పేకాటాడుతున్న 11 మందిని అరెస్ట్‌చేసి, వారివద్ద ఉన్న 1,38,800 రూపాయలు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. వేదాయపాళెం ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసరావు తన సిబ్బందితో ఈ దాడి చేసి జూదరులను అదుపులోకి తీసుకున్నారు.

# ఎన్‌బీకేఆర్‌లో ఓరియంటేషన్ ప్రోగ్రామ్


సమావేశంలో మాట్లాడుతున్న కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎం.శ్రీనివాసులు

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బీకేఆర్ ఐఎస్టీలో కొత్తగా ప్రవేశం పొందిన బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థులకు ఈనెల 19న ఓరియంటేషన్ ప్రోగ్రామ్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం. శ్రీనివాసులు మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో, సమయపాలన పాటిస్తూ శ్రద్ధగా చదువుకోవాలన్నారు. నిరంతర అధ్యయనానికి ప్రాధాన్యత ఇవ్వాలని, విద్యార్థులలో సాంకేతిక నైపుణ్యాలతో పాటు, కమ్యూనికేషన్ స్కిల్స్, నాయకత్వ లక్షణాలు, టీమ్ వర్క్ వగైరా లన్నీ పెంపొందించేందుకు కళాశాల నిర్వహిస్తున్న వివిధ కార్యక్రమాలని వివరించారు. అడ్మిషన్ విభాగం ఇన్‌చార్జి ప్రొఫెసర్ సి.రవీంద్రరెడ్డి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. కిషందర్ పాల్గొన్నారు.

# సమస్యలు తీర్చాలంటూ.. పెన్షనర్ల ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న పెన్షనర్లు

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 19న పెన్షనర్లు నెల్లూరు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ ఆందోళన జరిగింది. ఆ సంఘం అధ్యక్ష కార్యదర్శులు పున్నారావు,ర సత్తిరాజు మాట్లాడుతూ పెన్షనర్లకు నష్టం కలిగించే పెన్షన్ రీవాల్యుయేషన్ బిల్లును రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు పీఆర్సీని వెంటనే ఏర్పాటుచేసి, 2026 జనవరి1 నుంచి అమలులోకి వచ్చేలా వర్తింపజేయాలని కోరారు. అంగన్‌వాడీ – ఆశా కార్యకర్తలతో పాటు వివిధ రంగాల్లో పని చేస్తున్న అసంఘటిత రంగ కార్మికుల వేతనాల నుంచి ఈపీఎఫ్‌ని వసూలుచేసి, వారికి పెన్షన్ సౌకర్యం కల్పించాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న డీఏలని వెంటనే ప్రకటించాలని, అదేవిధంగా పెండింగ్ బకాయిలను దశలవారీగా చెల్లించాలని కోరారు.

# రెడ్‌క్రాస్‌లో రక్తదానం



రక్తదానం చేస్తున్న దాసరి రాజేంద్రప్రసాద్ తదితరులు

నెల్లూరులోని ఇండియన్ రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంక్‌లో ఈనెల 19న పలువురు దాతలు స్వచ్ఛంద రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ దివ్యాంగుల కేంద్రం కోఆర్డినేటర్ దాసరి రాజేంద్రప్రసాద్, స్పాస్టిక్ సెంటర్ ఇన్‌చార్జి జి.వాసు, డాక్టర్ దువ్వూరు పురంధర్, స్పీచ్ థెరపిస్ట్ దేవరాల విజయలక్ష్మి, వలంటీరు సౌభాగ్యం, దత్తాత్రేయులు రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి మాజీ కోఆర్డినేటర్ యాలమూరి రంగయ్య నాయుడు, సీహెచ్ జనార్ధన్‌రాజు, బయ్యా ప్రసాద్, డాక్టర్ నవీన్, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

# రామ్ శేషుకి.. అవార్డు




ప్రముఖ కార్టూనిస్ట్ బాచి గారు(హై కోర్టు సీనియర్ న్యాయవాది, మరియు ఆంధ్రప్రదేశ్ కార్టూనిస్టుల సంఘం అధ్యక్షులు) ప్రతి సంవత్సరం తన తల్లి శ్రీమతి అన్నం భాగ్యవతి (బాచి)పేరు మీద కార్టూన్ల పోటీని నిర్వహిస్తూ కార్టూనిస్టులను ప్రోత్సహిస్తున్నారు. 2026 సంవత్సరానికి నిర్వహించిన కార్టూన్ల పోటీలో నెల్లూరుకి చెందిన ప్రముఖ కార్టూనిస్ట్ మోపూరు రామ్ శేషు ద్వితీయ బహుమతిని పొందడం విశేషం. ఆగష్టు 15న విజయవాడ బాలోత్సవ భవన్‌లో జరిగిన బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీ బాచి గారు, సీనియర్ కార్టూనిస్ట్ ఏ.వి.ఎం పాల్గొని మోపూరు రామ్‌శేషుకి బాచి అవార్డు – 2026ని బహుకరించారు.


పురస్కారగ్రహీతలతో ముఖ్యఅతిథులు

# నాగభైరవ పురస్కారాలు

ప్రముఖ కవి డా. నాగభైరవ కోటేశ్వరరావు స్మారకంగా ఏటా ఒంగోలులోని నాగభైరవ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో ప్రదానం చేసే సాహిత్య పురస్కారాల కార్యక్రమం ఇటీవల స్థానిక రంగాభవన్‌లో జరిగింది. నాగభైరవ కుటుంబసభ్యులు గొల్లపూడి ప్రకాశరావుకి నాగభైరవ ఆత్మీయ పురస్కారాన్ని అందజేశారు. పలువురు సాహిత్య పురస్కార విజేతలకు నగదు బహుమతులు, సాహిత్యపీఠం పురస్కారాలను ముఖ్య అతిథులు చేతులమీదుగా బహుకరించారు. సభకు డా. నాగభైరవ ఆదినారాయణ అధ్యక్షత వహించగా, ప్రముఖ సాహితీవేత్తలు బీరం సుందరరావు, డా. గంగిశెట్టి శివకుమార్, అన్నమనేని ప్రసాద్, సింహాద్రి జ్యోతిర్మయి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ దత్త గురు ధ్యాన నిలయంలో.. 24న విశేష పూజలు



వెంకటాచలం మండలం గొలగమూడి గ్రామంలోని శ్రీ దత్త గురు ధ్యాన నిలయంలో ఈనెల 24న విశేష పూజలు జరుగనున్నాయి. అవధూత భగవాన్ శ్రీ వెంకయ్యస్వామివారి ఆరాధన సందర్భంగా ఆరోజున ఉదయం 8 గంటలకు శ్రీ వెంకయ్యస్వామివారికి, దత్తప్రభువుకి, సాయినాథునికి పూజలు, అభిషేకాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. 24వ తేదీ ఉదయం 10 గంటల నుంచి భజనలు, మధ్యాహ్నం 12 గంటలకు అన్నప్రసాద వితరణ, అనంతరం మధ్యాహ్నం 3 గంటల నుంచి భజనలు ఉంటాయని, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని సద్గురుదేవుల అనుగ్రహాశీస్సులు పొందాలని కోరారు.

## టూకీగా...



### ఆత్మకూరులో ఆర్టీసీ డిపో తనిఖీ

ఆత్మకూరులోని ఆర్టీసీ డిపోని ఈనెల 16న నెల్లూరు ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.జగదీష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రయాణీకులకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీశారు. ట్రాఫిక్ సెక్షన్, గ్యారేజీల్లో జరుగుతున్న పనులను పరిశీలించారు. డిపోమేనేజర్ ఎం.శివకేశ్‌యాదవ్, అసిస్టెంట్ మేనేజర్ సీహెచ్ రాజకుమార్, ఇన్‌చార్జి బాబురావు పాల్గొన్నారు.

### కలిగిరిలో మాదకద్రవ్యాల నిరోధంపై అవగాహన

మండల కేంద్రమైన కలిగిరిలో ఇటీవల ఎక్సైజ్ సీఐ అబ్దుల్ జలీల్ ఆధ్వర్యంలో స్థానిక మోడల్ జూనియర్ కళాశాల విద్యార్థులకు మాదకద్రవ్యాల నిరోధం పట్ల అవగాహన కలిగించారు. జీవితాలని నాశనం చేసే మత్తుపదార్థాలు, మాదక ద్రవ్యాలకి అందరూ దూరంగా ఉండాలని చెప్పారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### పెంచలకోనలో.. గరుడ పంచమి వేడుకలు

గరుడ పంచమి పర్వదినం సందర్భంగా ఈనెల 17న రాపూరు మండలంలోని పెంచలకోన దేవాలయంలో శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహస్వామికి అర్చకులు విశేషపూజలు చేశారు. విష్ణువుకి ప్రీతిపాత్రుడైన గరుడునికి పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ఉప కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.

### వావిలేటిపాడులో కార్డెన్ సర్చ్

నెల్లూరు రూరల్ మండల పరిధిలోని వావిలేటిపాడులో ఈనెల 17న పోలీసులు కార్డెన్ సర్చ్ నిర్వహించారు. ఇంటింటా తనిఖీలు చేశారు. ఎవరూ అసాంఘిక కార్యక్రమాలకి పాల్పడవద్దని, మత్తుపదార్థాలకి దూరంగా ఉండాలని చెప్పారు. గ్రామంలో అపరిచిత వ్యక్తులు కనిపిస్తే వారి ఆచూకీ తమకు తెలియజేయాలని గ్రామస్తులకు సీఐ వేణు సూచించారు.

### ముత్తుకూరులో క్రీడల విజేతలకి బహుమతులు

ముత్తుకూరులో ఇటీవల వాలీబాల్ టోర్నమెంట్‌లో విజేతలకి నిర్వాహకులు బహుమతులు ఇచ్చారు. ప్రథమ బహుమతి 5వేల రూపాయలను సర్వేపల్లి నియోజకవర్గ జనసేన నాయకుడు బొబ్బేపల్లి సురేష్‌బాబు, ఏఎంసి డైరెక్టర్ వాణి భవానినాయుడు అందజేయగా, మిగిలిన బహుమతులకు నగదును దాతల సహకారంతో అందజేసి క్రీడాకారులను ప్రోత్సహించారు.

### కావలిలో గణేష్ ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

కావలిలోని కలుగోళ శాంభవి దేవాలయంలో నిర్వహించనున్న దశాబ్ది గణేష్ నవరాత్రి ఉత్సవాల బ్రోచర్‌ని ఈనెల 16న కావలి ఎమ్మెల్యే దీవీ కృష్ణారెడ్డి తమ నివాసంలో ఆవిష్కరించారు. వచ్చేనెల 14 నుంచి 23వ తేదీ వరకు ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తామని నిర్వాహకులు చెప్పారు.

### ఘటికసిద్దేశ్వరంలో.. భక్తిశ్రద్ధలతో నాగపంచమి

సీతారామపురం మండలంలోని ఘటికసిద్దేశ్వరంలో ఉన్న శైవక్షేత్రంలో ఆలయ అర్చకులు ఈనెల 17న నాగపంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఘటిక సిద్దేశ్వర స్వామికి పూజలు చేసి, ఇష్టకామేశ్వరి అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక అభిషేకాలు చేశారు. ఆలయ నిర్వాహకులు పర్యవేక్షించారు.

### వింజమూరులో వాహనదారులకు క్లాస్‌పీకిన ఎస్ఐ

వింజమూరు ఎస్ఐ ఉమామహేశ్వరరావు ఇటీవల ద్విచక్రవాహనదారులకు క్లాస్ పీకారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని స్పష్టం చేశారు. అధికలోడుతో వెళ్తున్న వాహనాలను ఆపి, చలానా విధించారు. వేగంగా నడపకూడదని, ఎక్కువ మందిని ఎక్కించుకుంటే చర్యలు తప్పవని ఆటోల వారినీ హెచ్చరించారు.

### సైదాపురంలో 'సర్' సవరణ ప్రక్రియ

సైదాపురం మండల పరిధిలోని మర్లపూడి గ్రామంలో ఇటీవల ఓటర్ల సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహించారు. ఓటర్ల పేర్లు, ఇంటిపేర్లు తదితరాలను పరిశీలించారు. తహశీల్దార్ సుభద్ర, ఏఓ మురళీకృష్ణ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. రెవెన్యూ, స్వర్ణ గ్రామ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ‘నేనున్నా..ఎల్లవేళలా మీ కోసమే’!


**రోగులకు ‘అపోలో’ అభయం**




*దేశంలో ప్రఖ్యాతి చెందిన అపోలో హాస్పిటల్స్ తాజాగా ‘నేనున్నా..ఎల్లవేళలా మీకోసమే’ అంటూ సరికొత్త నినాదంతో రోగుల సేవకు ముందుకొచ్చింది. మీ బాధలు వింటూ మీ కోసం ఎల్లవేళలా వైద్యసేవలందిస్తా నంటూ రోగులకు అపోలో హాస్పిటల్స్ సంస్థ అభయమిస్తోంది. ఆదివారాలతో సహా వారంలోని ఏడు రోజులూ సాధారణ మరియు ప్రణాళికాబద్ధమైన ఆరోగ్య సంరక్షణ సేవలను అందుబాటులోకి తెస్తున్నామంటూ రోగులకు శుభవార్త చెప్పింది. భారతదేశం నుండి ఆరోగ్య సంరక్షణ రంగంలో ప్రపంచం లోనే మొట్టమొదటిసారిగా అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వ్యవస్థాపకులు మరియు ఛైర్మన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి ఆధ్వర్యంలో ఈనెల 18న ‘ఆల్వేస్ ఓపెన్.. ఆల్వేస్ హియర్’ అనే నినాదంతో రోగుల సేవ కోసం ఒక వినూత్నమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.*

అపోలో యొక్క అత్యవసర, క్రిటికల్ కేర్ మరియు ఇన్‌పేషెంట్ సేవలు ఎల్లప్పుడూ 24 గంటలూ అందుబాటులో ఉంటాయి. ఈ కొత్త కార్యక్రమం, ఔట్ పేషెంట్ కన్సల్టేషన్లు, డయాగ్నోస్టిక్స్, నివారణ ఆరోగ్య పరీక్షలు, ఫాలో–అప్ కన్సల్టేషన్లు మరియు షెడ్యూల్డ్ ప్రొసీజర్‌ల కోసం ఆదివారాల్లో కూడా యాక్సెస్‌ను అందిస్తుంది. దీనివల్ల రోగులు మరియు వారి కుటుంబాలు వారం రోజుల కోసం వేచి ఉండకుండా సకాలంలో సంరక్షణ పొందగలుగుతారు. ఉద్యోగం చేసే చాలా మంది భారతీయులకు, సకాలంలో ఆరోగ్య సంరక్షణ పొందడానికి సమయం అనేది అతిపెద్ద అడ్డంకులలో ఒకటి. తీరికలేని పని వేళలు, కుటుంబ బాధ్యతలు మరియు వారాంతపు పనుల కారణంగా ప్రజలు తరచుగా సంప్రదింపులు, పరీక్షలు మరియు ఆరోగ్య తనిఖీలను వాయిదా వేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో.. ఊబకాయం, అధిక రక్తపోటు, మధుమేహం మరియు జీవక్రియ సంబంధిత రుగ్మతలు వంటి జీవనశైలి వ్యాధుల భారం పెరుగుతోందని, ఇవి భారతీయుల అత్యంత ఉత్పాదక సంవత్సరాలలో వారిని ఎక్కువగా ప్రభావితం చేస్తున్నాయని అపోలో వారి ‘హెల్త్ ఆఫ్ ది నేషన్ 2026’ నివేదిక తన అధ్యయనంలో స్పష్టం చేసింది. భారతదేశంలోని అపోలో ఎకోసిస్టమ్ అంతటా 25 లక్షలకు పైగా వ్యక్తులకు నిర్వహించిన ఆరోగ్య పరీక్షల ఆధారంగా, ఒక నిశ్శబ్ద మహమ్మారి ఖచ్చితంగా పెరుగుతోందని ఆ నివేదిక తేటతెల్లం చేసింది. దీనిలో, ఎటువంటి కనిపించే లక్షణాలు లేనప్పటికీ, లక్షలాది మంది నిర్ధారణ కాని దీర్ఘకాలిక వ్యాధులతో జీవిస్తున్నారు. దాదాపు 26శాతం మందికి అధిక రక్తపోటు ఉన్నట్లు మరియు 23 శాతం మందికి మధుమేహం ఉన్నట్లు లక్షణాలు లేనప్పటికీ కనుగొనబడింది. ఇది లక్షణాల ఆధారిత ఆరోగ్య సంరక్షణ నమూనాగా తేల్చిచెప్పింది. అపోలో హాస్పిటల్స్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్ శ్రీరామ్ సతీష్, యూనిట్ హెడ్ విశ్వేశ్వర్ రెడ్డి, ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రోగుల ఆరోగ్యం కోసం..అన్నివేళలా సత్వర సేవలు



చైర్మెన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి

“మేము అత్యవసర మరియు క్లిష్టమైన సంరక్షణ కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉన్నాం. ఇప్పుడు మేము అదే నిబద్ధతను వారంలోని ఏడు రోజులూ సాధారణ మరియు నివారణ సంరక్షణకు విస్తరిస్తున్నాం. ఇది ప్రతి భారతీయునికి మా సేవా ముద్ర” అంటున్నారు అపోలో హాస్పిటల్స్ గ్రూప్ వ్యవస్థాపకులు మరియు ఛైర్మెన్ డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి. అందుకే, ‘ఆల్వేస్ ఓపెన్.. ఆల్వేస్ హియర్’ (ఎల్లప్పుడూ తెరిచి ఉంటుంది.. ఎల్లప్పుడూ ఇక్కడే ఉంటుంది)’ అనే కార్యక్రమం చేపట్టామని ఆయన చెప్పారు. “నాలుగు దశాబ్దాలకు పైగా, ఆరోగ్య సంరక్షణ అంటే కేవలం అనారోగ్యానికి చికిత్స చేయడం మాత్రమే కాదని, ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మరియు వ్యాధులను నివారించడమని అపోలో విశ్వసిస్తోందని ఆయన తెలిపారు. ఆ ఉద్దేశంతోనే అపోలో ‘ఎల్లప్పుడూ తెరిచి ఉంటుంది. ఎల్లప్పుడూ ఇక్కడే ఉంటాము.’ అనేది ఆ వాగ్దానానికి కొనసాగింపు అని అన్నారు. అంతేకాదు, “ఈ చొరవ అపోలోలోని ప్రతి డాక్టర్, నర్సు, టెక్నీషియన్, ఆరోగ్య కార్యకర్తలకు మరియు వారి కుటుంబాలకు కూడా ఒక సూచన అన్నారు. ‘ఆరోగ్య సంరక్షణ’ అనేది స్వార్థం కన్నా సేవకే ప్రాధాన్యతనిచ్చే వృత్తి. వారి నిబద్ధత భారతదేశవ్యాప్తంగా ఉన్న రోగులు మరియు కుటుంబాల కోసం ఈ అడుగు వేయడానికి మాకు వీలు కల్పిస్తోంది. ఒక సకాల సంప్రదింపు వ్యాధిని ముందుగానే గుర్తించడానికి లేదా సంక్షోభాన్ని నివారించడానికి సహాయపడితే, మనం ఒకరి జీవితాన్ని మార్చినట్లే. సంక్షోభానికి ముందే సంరక్షణను ఎంచుకునేలా మనం లక్షలాది మందికి ఇది ఒక వరం అని ఆయన అన్నారు. ఆదివారం నాడు సేవలను మరింత క్రమబద్ధంగా మరియు రోగికి అనుకూలంగా అందించడానికి, ఈ కార్యక్రమం అపోలో యొక్క ప్రస్తుత వైద్య మౌలికసదుపాయాలు, వైద్యులు, రోగ నిర్ధారణ కేంద్రాలు, ఆపరేటింగ్ థియేటర్లు మరియు సమన్వయ సంరక్షణ బృందాలను ఉపయోగించుకుంటుందని ఆయన వివరించారు.

# విద్యా కల్పతరువు.. యేల్చూరు రంగనాథం జూనియర్ కళాశాల





రాజా సత్యనారాయణ
కళాశాల వ్యవస్థాపకులు

*నెల్లూరుజిల్లా ఉదయగిరి నియోజకవర్గం వింజమూరులో 1976లో స్థాపించబడిన యేల్చూరు రంగనాథం జూనియర్ కళాశాల (వైఆర్‌జెసి) ఆగస్టు 25న స్వర్ణోత్సవ సంబరాలు జరుపుకుంటోంది. గత 50 సంవత్సరాలుగా కళాశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులకు, దశాబ్దాలుగా అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి ఈ సందర్భం అత్యంత సంతోషదాయకం, చిరస్మరణీయం.*

ఎటువంటి ఉపాధి అవకాశాలు లేక వలసలకు పేరుగాంచిన మెట్ట ప్రాంతం ఉదయగిరి నియోజకవర్గం. స్థానికంగానే పదవ తరగతిపైన చదువుకోవాలని ఆశించిన విద్యార్థుల ఆకాంక్షను గమనించిన నాటి స్థానిక రాష్ట్రీయ స్వయంసేవక సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) హరిహర ఎడ్యుకేషనల్ ట్రస్ట్‌ను స్థాపించి, వింజమూరు జిల్లా పరిషత్ హైస్కూల్ హెడ్మాస్టర్‌గా పనిచేస్తున్న జేష్ఠ ఆర్‌ఎస్‌ఎస్ స్వయంసేవక్ రాజా సత్యనారాయణకి కళాశాలను స్థాపించే బాధ్యతలు అప్పజెప్పారు. ఆనాటి కావలి శాసనసభ్యులుగా ఉన్న గొట్టిపాటి కొండపనాయుడు కళాశాల అనుమతికి అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జలగం వెంగళరావుని ఒప్పించారు. ప్రారంభ దశలో భవనాల నిర్మాణానికి, మౌళిక వసతులకు అప్పటి జిల్లా పరిషత్ ఛైర్మెన్ మేనకూరు గోపాలకృష్ణారెడ్డి, జిల్లా కలెక్టర్ సైకం అర్జున్‌రావు మొదలైనవాళ్ళు తమ సహాయ సహకారాలు అందించారు.

ప్రభుత్వానికి కార్పస్ ఫండ్ కట్టడానికి నిధులు కరువైతే, వింజమూరుకు చెందిన అనేకమంది గ్రామ పెద్దలు, దాతలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆర్థిక సహాయం అందించారు. అదేవిధంగా తరువాతి కాలంలో నెల్లూరుజిల్లా కలెక్టర్లుగా పని చేసిన జన్నత్ హుస్సేన్, కే.రాజు, హెచ్.కే. బాబు తదితరులు కళాశాల అభివృద్ధి కోసం అందించిన చేయూత చిరస్మణీయం.

వై.ఆర్. జూనియర్ కళాశాలకు 1975లో అనుమతులు వచ్చాయి. అయితే, వసతులు, ఆర్థికలేమి వలన 1976లో 3 ఎకరాల విస్తీర్ణంలో 17మంది విద్యార్థులతో సిఇసి గ్రూపును మొట్టమొదటిగా ప్రారంభించారు. తరువాత ఎంపీసీ, బైపిసి కోర్సులను కూడా జత చేశారు. హెడ్మాస్టర్ ఉద్యోగానికి రాజీనామా చేసిన రాజా సత్యనారాయణ కళాశాల ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు చేపట్టారు. పదవీ విరమణ అనంతరం కళాశాల కరస్పాండెంట్‌గా సంస్థ పురోగతి కోసం ఆయన జీవితాంతం తమ సేవలు అందించడం శ్లాఘనీయం. వింజమూరుకి చెంది చెన్నైలో స్థిరపడిన వ్యాపారవేత్తలు, వైశ్య ప్రముఖులు యేల్చూరు రంగనాథం, యేల్చూరు పెరియాల్ శ్రేష్టిల భూరి విరాళంతో ఏర్పడిన కాలేజీకి యేల్చూరి రంగనాథం జూనియర్ కళాశాలగా పేరు పెట్టారు. కళాశాలని పూర్తి స్థాయిలో విస్తరించడానికి 1978 నుంచి 1985 వరకు ఉదయగిరి నియోజకవర్గం శాసనసభ్యులుగా ఉన్న ముప్పవరపు వెంకయ్యనాయుడు సహాయ సహకారాలు ఎప్పటికీ మరువలేనివి.

ఆత్మకూరు, కావలి ప్రాంత విద్యార్థులతో పాటు కడప, ప్రకాశం జిల్లాలు సరిహద్దులుగా కలిగిన ఉదయగిరి నియోజకవర్గంలోని వై.ఆర్.జూనియర్ కళాశాలలో బద్వేలు, పోరుమామిళ్ల, పామూరు, కనిగిరి మొదలైన దూరప్రాంతాల నుండి కూడా విద్యార్థులు వచ్చి విద్యను అభ్యసించేవారు. ప్రారంభంలో దూర ప్రాంత విద్యార్థుల కోసం శివాలయానికి చెందిన సత్రాలను విద్యార్థుల వసతిగృహాలుగా వాడుకొనేవారు. తదనంతరం దాతల సహాయంతో కళాశాల ప్రాంగణంలోనే వసతి గృహాలను నిర్మించారు. నామ మాత్రపు ఫీజులతో, ఉత్తమ బోధకులతో నాణ్యమైన విద్యను అందించిన వై.ఆర్. జూనియర్ కళాశాలకు విద్యార్థుల తాకిడి ఎక్కువైనప్పుడు ప్రవేశ పరీక్ష నిర్వహించి విద్యార్థులకు ప్రవేశాలు కల్పించిన ఘనమైన చరిత్ర బహుశా రాష్ట్రంలోనే వై.ఆర్ జూనియర్ కళాశాలకి మాత్రమే దక్కుతుందనడంలో సందేహం లేదు.

రాజా సత్యనారాయణకి ఆర్యవైశ్య సంఘం ద్వారా మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యతో మంచి సన్నిహిత సంబంధాలు ఉండేవి. ఆ సాన్నిహిత్యం కారణంగా అనేక సందర్భాలలో కళాశాల అభివృద్ధికి రోశయ్య కూడా సహాయసహకారాలు అందించారు. ముఖ్యంగా ఉన్నత విద్యాశాఖ మంత్రిగా ఉన్న రోశయ్య వై.ఆర్. జూనియర్ కాలేజీకి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌ను మంజూరు చేయటంలో తమ పూర్తి సహాయసహకారాలు అందించారు. గడచిన 5 దశాబ్దాలుగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన అనేకమంది వై.ఆర్.జూనియర్ కళాశాలలో చదువుకుని డాక్టర్లు, ఇంజనీర్లు, ఉపాధ్యాయులు, అధ్యాపకులు, వ్యాపారవేత్తలుగా దేశంలో పలు ప్రాంతాలలో స్థిరపడ్డారు. అదేవిధంగా వై.ఆర్. జే.సీలో నెలకొల్పిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ ద్వారా వేలమంది విద్యార్థులు డిగ్రీ మరియు పీజీ పూర్తిచేసే అవకాశం కలగడం ఎంతో సంతోషదాయకం.

నేటి కార్పొరేట్ విద్యాసంస్థలతో పోటీపడుతూ కూడా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు విద్యను అందిస్తున్న యేల్చూరు రంగనాథం జూనియర్ కళాశాల చరిత్ర గణనీయం. ఈ కాలేజీని మరింత అభివృద్ధి చేసే ప్రయత్నాలు కూడా ప్రారంభమయ్యాయి. ఈ స్వర్ణోత్సవ పండుగ సందర్భంగా దేశ విదేశాలలో ఉన్న పూర్వవిద్యార్థులు అనేకమంది పెద్ద మనసుతో ముందుకొస్తున్నారు. కళాశాల అభివృద్ధి కోసం తమ చేయూతనందించడానికి ఆసక్తి చుపిస్తున్నారు. తమని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన తమ కాలేజీ పట్ల వారికున్న గురుత్వానికి ఇదే నిదర్శనం. ఆగస్టు 25న కళాశాల ప్రాంగణంలో మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సమక్షంలో స్వర్ణోత్సవాల సంబరాలు మరియు పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించుకోవడానికి వై.ఆర్. జూనియర్ కాలేజీ ముస్తాబవుతోంది. కళాశాల చరిత్రలో ఇదొక సువర్ణాధ్యాయం.

(ఆగస్టు 25, స్వర్ణోత్సవాల సందర్భంగా)



**ఆచార్య యల్లాల వెంకటరామిరెడ్డి**
పూర్వవిద్యార్థి
యేల్చూరు రంగనాథం జూనియర్ కళాశాల,
వింజమూరు.

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Magunta Layout, NELLORE-3. Cell: 9866314741. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Managing Editor : **T.BHARATHI REDDY,** Sub-Editor : **MADDURU SRINIVASULU.** e-mail: lawyerpatrika@gmail.com